




మంగళవారం ఉష్ణోగ్రత

	కనిష్ఠం	గరిష్ఠం
ఖమ్మం	24.7	41.5
భద్రాద్రి	26	40

రిలాక్స్.. రిలాక్స్..

పోలింగ్ ముగియడంతో టూర్ల బాటలో నేతలు

- ఎన్నికల ఒత్తిడి నుంచి ఉపశమనం కోసం ప్లాన్లు
- వ్యవసాయ క్షేత్రంలో సేద తీరుతున్న మంత్రి తుమ్మల
- ఎమ్మెల్యేలతో కలిసి శబరిమలకు వెళ్లిన మంత్రి పొంగులేటి
- హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క..
- కౌంటింగ్ వరకు రిలీఫ్‌గా గడిపేందుకు ప్రయత్నాలు
- పర్యాటక ప్రాంతాలకు వెళ్తున్న ద్వితీయ శ్రేణి నాయకులు



దమ్మపేటలో పార్టీ నాయకులతో మంత్రి తుమ్మల



ఇండిగో విమానంలో మంత్రి పొంగులేటి

ఖమ్మం, మే 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల పర్వం పూర్తికావడం.. కౌంటింగ్‌కు 18రోజుల వరకు గడువు ఉండడంతో ప్రజాప్రతినిధులు నాయకులు పుణ్యక్షేత్రాలు, విహారయాత్రలు బాట పడుతున్నారు. నెలరోజులుగా ఎన్నికల్లో బిజీగా గడిపిన అధికార, విపక్షాల నేతలు రిలాక్స్ అయ్యేందుకు ప్లాన్లు సిద్ధం చేసుకుంటున్నారు. పోలింగ్ పూర్తికావడంతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎన్నికల కోడ్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ కార్యక్రమాలకు దూరంగా ఉండాలి కాబట్టి తన వ్యవసాయక్షేత్రంలో వ్యవసాయ పనులు చక్కదిద్దుకుంటున్నారు. సమయం అంతా వ్యవసాయ క్షేత్రానికి వెచ్చిస్తూ తన స్వగ్రామం గండుగులపల్లిలో ఉమ్మడి జిల్లా నుంచి వచ్చే నాయకులు కార్యకర్తలను కలుస్తున్నారు.

రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచర ఎమ్మెల్యేలు తెల్లం వెంకటరావు, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణతో పాటు రాష్ట్ర విద్యామౌలిక సదుపాయాల కల్పన చైర్మన్ మువ్వా విజయ్‌బాబు డీసీసీబీడైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్యతో కలిసి శబరిమలకు అయ్యప్పస్వామి దర్శనానికి కొచ్చికి ఇండిగో విమానం వెళ్లారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కూడా పొంగులేటి అయ్యప్పనస్వామి దర్శనం చేసుకున్నారు. ఎన్నికల్లో గెలిచిన తర్వాత వస్తానని మొక్కా రు. ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్ర మంత్రి కావడం, అసెంబ్లీ ఎన్నికల తర్వాత వెంటనే లోక్‌సభ ఎన్నికలు రావడంతో అయ్యప్ప దర్శనంకు వెళ్లడం కుదరలేదు. దీంతో ఎన్నికల ప్రక్రియ పూర్తికావడంతో మంగళవారం మొక్కు చెల్లించేందుకు అయ్యప్ప దర్శనబాట పట్టారు తర్వాత కూడా కుటుంబసభ్యులతో కలిసి పర్యాటక ప్రదేశాలకు వెళ్లే అవకాశం ఉన్నట్టు ఆయన వర్గీయులు చెబుతున్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఎన్నికల అనంతరం హైదరాబాదులోనే ఉంటున్నారు. అక్కడ నాయకులు, కేడర్‌ను కలుస్తున్నారు. జిల్లాలో ఎమ్మెల్యేలు, అధికాపార్టీ నేతలు రాష్ట్రంలో ఇతర రాష్ట్రాల్లోని పుణ్యక్షేత్రాలు పర్యాటక ప్రదేశాలకు కుటుంబసభ్యులతో కొందరు అనుచరులతో మరికొందరు వెళ్లేందుకు సిద్ధం చేసుకుంటున్నారు. బీఆర్ఎస్, బీజేపీలో కడా ముఖ్యనాయకులు ప్రజాప్రతినిధులు కౌంటింగ్ లోగా టూర్లకు వెళ్లేప్రయత్నాల్లో ఉన్నారు. కుటుంబసభ్యులతో పర్యాటకప్రదేశాలకు, పుణ్యక్షేత్రాలకు వెళ్లేబోతున్నారు. పార్టీల నాయకులు, అనుచరులు కూడా దూరప్రాంతాలకు రాష్ట్రంలోను, ఇతర రాష్ట్రాల్లోని పర్యాటక ప్రదేశాలకు వెళ్లబోతున్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక కూడా ఉన్నందున ఆ ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు టూర్లకు ప్లాన్లు చేసుకుంటున్నారు. లోక్‌సభ ఎన్నికల తర్వాత గ్రామ పంచాయతీలు, ఆ వెంటనే ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, మునిసిపాలిటీలకు, సహకార ఎన్నికల రాబోతున్నందున ముందు చూపుతోయాత్రలకు వెళ్తున్నట్టు చెబుతున్నారు.

విమానంలో సాంకేతిక లోపం..

మణుగూరు టౌన్: మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య ప్రయాణిస్తున్న ఇండిగో విమానం మంగళవారం హైదరాబాద్‌లోని శంషాబాద్ విమనాశ్రయంలో సాంకేతిక లోపంతో రన్‌వేపై ఆగిపోయింది. అయ్యప్ప స్వామి పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకుని మంత్రి అనుచరులతోపాటు ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, జారె ఆదినారాయణ, తెల్లం వెంకట్రావ్, రాష్ట్ర విద్యామౌలిక సదుపాయాల కల్పన చైర్మన్ మువ్వ విజయ్‌బాబు, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య అనుచరులు ఇండిగో విమానంలో కొచ్చికి బయలుదేరారు. అయితే సాంకేతిక లోపంతో సదరు విమానం రన్‌వేపై ఆగిపోయింది. కొంతసమయం తర్వాత బయలుదేరిన విమానం.. మంత్రితోపాటు ఎమ్మెల్యేలను క్షేమంగా గమ్యానికి చేర్చింది. అయ్యప్పస్వామిని దర్శించుకున్న అనంతరం వారు వెనుదిరగనున్నట్లు తెలిసింది. కాగా, రన్‌వేపై నిలిచిపోయిన విమానంలోని దృశ్యాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి.



ఇండిగో విమానంలో ఎమ్మెల్యేలు పాయం, జారే, తెల్లం

కాంగ్రెస్‌కు భారీ విజయం తథ్యం

- రాష్ట్రంలో సంక్షేమ పాలనకు ప్రజలు జై కొట్టారు
- కోడ్ అనంతరం ఇక అభివృద్ధి పరుగులు
- గోదావరి జలాలు తీసుకు రావడమే నా జీవితాశయం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఖమ్మం, మే 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి పోలింగ్ సరళి బట్టి భారీ ఆధికత్య ఉండనుందని, ప్రజలు కాంగ్రెస్‌పట్ల ఆదరణ చూపించారని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం విడుదల చేసినప్రకటనలో కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా లోక్‌సభ ఎన్నికల్లో నిలిచినందుకు ధన్యవాదాలు తెలిపారు. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డినాయకత్వంపై ప్రజలు పెద్దఎత్తున మద్దతు తెలిపారని, తద్వారా భారీ మెజారిటీలతో పలు లోక్‌సభ నియోజకవర్గాలు గెలచుకోబోతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతెలిపారు.

ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు నాలుగు దశాబ్దాలుగా తన రాజకీయ జీవితంలో వెన్నంటి ఉండి అండగా నిలిచారని, ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధి కి భాగస్వాములుగా ఉంటూ ముందుకు నడిపిస్తున్నారని, లోక్‌సభ ఎన్నికల్లో కూడా ఇదే స్ఫూర్తితో భారీ ఆధిక్యతతో కాంగ్రెస్‌ను గెలిపించబోతున్నారన్నారు. ఐదు నెలల కాలంలో ఆరుగ్యారంటీల పథకాల అమలుతీరు. ప్రజాసంక్షేమం కోసం ప్రజాపాలన, మెచ్చిమరింత విశ్వాసంతో లోక్‌సభ ఎన్నికల్లో మద్దతుగా నిలిచారని తెలిపారు.

ఇంకా ప్రజాక్షేత్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు చూశానని, వాటిని కూడా ఎన్నికల కోడ్ అనంతరం పూర్తి చేయిస్తానని, గోదావరి జలాలను ఉమ్మడి ఖమ్మం జిల్లాకు పారించి సస్యశ్యామలం చేయడమే ఆశయమని తెలిపారు. వచ్చే వానాకాలం సీజన్‌లోనే వైరా రిజర్వాయర్‌కు గోదావరి జలాలను అనుసంధానం చేయిస్తానని, తెలంగాణ రాష్ట్రాన్ని పామాయిల్ హబ్‌గా మారుస్తానని, జిల్లాలో జాతీయ రహదారులు, బుగ్గపాడు ఫుడ్‌పార్కు వంటి పనులు కూడా జిల్లా అభివృద్ధి స్వరూపాన్ని మార్చబోతున్నాయని, భద్రాచలానికి కరకట్ట పూర్తిచేయించి వరద నుంచి పట్టణాన్ని రక్షించబోతున్నామని, ఖమ్మం మున్నేరు వరద లేకుండా గోడ నిర్మాణ పనులు పూర్తిచేయిస్తానని తెలిపారు. మహబాద్ లోక్‌సభ ఇన్‌చార్జిగా అక్కడ అనేక సమస్యలు ఎన్నికల ప్రచారంలో దృష్టికి వచ్చాయని, భద్రాద్రి రాముడి ఆశీస్సులతో లభించిన మంత్రి పదవిని హంగు ఆర్భాటాల కోసం కాకుండా ప్రజాజీవితాల్లో మార్పుకోసం పనిచేస్తానని తెలిపారు.

వేంసూరులో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మిస్తాం

- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

6



మీడియా సమావేశంలో పాల్గొన్న నామా నాగేశ్వరరావు, రవిచంద్ర, తాతా మధు...

బీఆర్ఎస్‌దే గెలుపు...

- ప్రభుత్వ వ్యతిరేక ఓటు స్పష్టంగా కనిపించింది
- బీఆర్ఎస్ నేతలు నామా, వద్దిరాజు, తాతా మధు

ఖమ్మం, మే 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌దే గెలుపని, ఖమ్మం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు, ఎమ్మెల్సీ తాతా మధుసూధన్ పేర్కొన్నారు. ఖమ్మం బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశలో మాట్లాడారు. బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ పోలింగ్ రోజున ఓటర్లు సైలెంట్‌గా బీఆర్ఎస్‌కు మొగ్గు చూపారని, గ్రామాల్లో బారులు తీరిన ఓటర్లు ప్రభుత్వానికి వ్యతిరేకంగానే ఓటింగ్‌లో ఉత్సాహం చూపారని తెలిపారు.

ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపుకోసం నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున శ్రమించారని, అలాగే ఎన్నికల నిర్వాహణ ప్రక్రియను అధికారులు పకడ్బందీగా చేపట్టారని, అందుకు కృతజ్ఞతలు తెలిపారు. లోక్‌సభ సభ్యుడుగా నా పనితీరు చూసి ఈసారి ప్రజలు బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపారని, అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేసినా ఈ ఐదు నెలల్లో కాంగ్రెస్ పట్ల వ్యతిరేకత నెలకొందని, రాష్ట్రంలో కూడా బీఆర్ఎస్‌కు అనుకూలంగానే ఓటర్లు పోలింగ్‌లో మొగ్గుచూపారన్నారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మాట్లాడుతూ ఖమ్మం - మహబూబాబాద్ లోక్‌సభలో బీఆర్ఎస్‌కే ఆధిక్యత ఉంటుదన్నారు. ఎమ్మెల్సీ జిల్లా పార్టీ అధ్యక్షుడు తాతా మధుసూదన్ మాట్లాడుతూ బీఆర్ఎస్ విజయం కోసం నాయకులు, కార్యకర్తలు పగలు రాత్రి శ్రమించారని, కార్యకర్తలకు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. లోక్‌సభ నియోజకవర్గ ప్రజలు బీఆర్ఎస్‌కే పట్టం కట్టబోతున్నారన్నారు. ఈవిలేకరుల సమవేశంలో మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కొండబాల కోటేశ్వరరావు, డీసీసీబీ మాజీచైర్మన్ కూరాకుల నాగభూషణం, గుండాల కృష్ణ, ఉప్పల వెంకటరమణ, నగర అధ్యక్షుడు పగడాల నాగరాజుపాల్గొన్నారు

పోలింగ్ శాతం 76.09

- ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో లెక్క తేల్చిన అధికారులు
- 2019 ఎన్నికల కంటే స్వల్పంగా పెరుగుదల

ఖమ్మం, మే 14 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గంలో 76.09 శాతం పోలింగ్ నమోదైనట్టు అధికారికంగా వెల్లడైంది. 2019 పార్లమెంటు ఎన్నికల్లో 75.30 శాతం పోలింగ్ నమోదుకాగా ఈ యేడాది స్వల్పంగా పెరిగినట్టుగా తెలుస్తోంది. కాగా ప్రస్తుతం జరిగిన లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌లో 16,31,039 మంది ఓటర్లకుగాను 12,41,135 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారిలో 7,87,160 మంది పురుష ఓటర్లు ఉండగా అందులో 6,05,969 మంది, 8,43,749 మంది మహిళలకుగాను 6,35,099 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 130 మంది థర్డ్ జెండర్స్‌కుగాను 67 మంది ఓటు హక్కును వినియోగించుకున్నట్టు అధికారులు తెలిపారు.

మహబూబాబాద్‌లో 71.85 శాతం

మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గంలో 71.85 శాతం పోలింగ్ నమోదైంది. సోమవారం అర్ధరాత్రి దాటాక ఎన్నికల పోలింగ్ శాతాన్ని అధికారులు వెల్లడించారు. పార్లమెంటరీ నియోజకవర్గ పరిధిలోని ములుగు, నర్సంపేట, మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లందు, పినపాక, భద్రాచలం అసెంబ్లీ సెగ్మెంట్‌లలో మొత్తం ఓటర్లు 15,32,366 మంది ఉండగా ఇందులో పురుషులు 7,47,836 మంది , స్త్రీలు 7,84,424 మంది, ఇతరులు 106 మంది ఉన్నారు. వీరిలో 11,01,030 మంది ఓటు హక్కు వినియోగించుకోగా పురుషులు 5,42,304 మంది, స్త్రీలు 5,58,678 మంది, ఇతరులు 48 మంది ఓటు వేయగా 71.85 శాతం పోలింగ్ నమోదైంది. ఓట్లు వేసిన వారిలో పురుషుల కంటే 16,374 మంది మహిళలు ఉండడం విశేషం.



రెప్పవాల్చని నిఘా.. 24గంటల భద్రత

- స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ఠ బందోబస్తు
- ఖమ్మం రిటర్నింగ్ అధికారి వీపీ గౌతమ్
- పొన్నేకల్ లోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాట్ల పరిశీలన

6

ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పోలింగ్ గణాంకాలు..

	మొత్తం ఓట్లు				పోలైన ఓట్లు				
నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం	పోలింగ్ శాతం
ఖమ్మం	1,55,284	1,68,740	49	3,24,073	98,993	1,05,057	28	2,04,078	62.97
పాలేరు	1,15,717	1,25,081	08	2,40,806	97,917	1,03,800	04	2,01,721	83.77
మధిర	1,07,111	1,15,039	10	2,22,160	88,939	92,870	06	1,81,815	81.84
వైరా	93,700	99,683	06	1,93,389	76,436	80,323	03	1,56,762	81.06
సత్తుపల్లి	1,18,490	1,25,441	12	2,43,943	95,928	1,00,046	05	1,95,979	80.34
కొత్తగూడెం	1,19,477	1,27,979	38	2,47,494	84,570	87,339	19	1,71,928	69.47
అశ్వారావుపేట	77,381	81,786	07	1,59,174	63,186	65,664	02	1,28,852	80.95
మొత్తం	7,87,160	8,43,749	130	16,31,039	6,05,969	6,35,099	67	12,41,135	76.09



'తెలంగాణ' యోధుడు రాందాస్ కన్నుమూత

- 1969 ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో క్రియాశీల పాత్ర
- నివాళులర్పించిన పలువురు ప్రముఖులు

ఇల్లెందు టౌన్, మే 14 : ప్రత్యేక తెలంగాణ తొలి ఉద్యమకారుడు కొలిశెట్టి రాందాస్(88) మంగళవారం అనారోగ్యంతో మృతిచెందారు. 1969లో మొట్టమొదటగా ఇల్లెందులో జరిగిన నాన్ ముల్కీ ఉద్యమానికి నాంది పలికిన పోరాట యోధుల్లో రాందాస్ ముందుభాగాన నిలిచారు. ఇల్లెందు పట్టణ వాసిగా రాందాస్ చేపట్టిన ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో అనేకమంది యువకులు పాల్గొన్నారు. కేటీపీఎస్‌లో స్థానికేతరులకు ఉద్యోగాలు ఇవ్వొద్దని ఉద్యమం లేవనెత్తారు. ఖమ్మంలో కూడా ఉద్యమానికి రాందాస్ ప్రేరణగా నిలిచారు. అనంతరం సింగరేణిలో క్లర్కుగా ఉద్యోగంలో చేరి ఏజీఎంగా రిటైరయ్యారు. ఉద్యోగ విరమణ అనంతరం హైదరాబాద్‌లో స్థిరపడిన రాందాస్ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మూడేళ్ల క్రితమే భార్య మరణించారు. కాగా, రాందాస్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో సభను నిర్వహించారు. రాందాస్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆనాడు ఆయన చేసిన ఉద్యమాలను పలువురు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తొలిదశ ఉద్యమకారులు చందా చంద్రశేఖర్, రామచందర్, దిండిగల యాదిరెడ్డి, సాదత్ అలీ, బీఆర్ఎస్ నాయకులు దిండిగల రాజేందర్, కృష్ణారావు, అబ్దుల్ నబీ తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి తీరని లోటు

కొత్తగూడెం టౌన్: తొలిదశ తెలంగాణ ఉద్యమకారుడు రాందాస్ మరణం తెలంగాణ సమాజానికి తీరనిలోటని కాంగ్రెస్ నాయకుడు గొల్లపల్లి దయానంద్ అన్నారు. మంగళవారం బస్టాండ్‌సెంటరులోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1969 తొలిదశ ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన రాందాస్.. దోపిడీకి ఎదురొడ్డి నిలిచారని తెలిపారు. కొత్తగూడెం, ఇల్లెందు ప్రాంతంలో తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోసిన వ్యక్తిగా కీర్తించారు. ఈ కార్యక్రమంలో శాంతిరాం, గాంధీపథం గెర్షోం, కార్మికనాయకులు బిక్కులాలు, మురళీ, రషీద్ తదితరులు పాల్గొన్నారు.



నిర్ధారణకు వెళితే నిలువు దోపిడే..

నగరంలో డయాగ్నస్టిక్ కేంద్రాల మాయాజాలం

- నిర్దేశిత ఫీజుల కంటే అధికంగా వసూలు
- సమస్య ఏదైనా స్కానింగ్ తప్పనిసరి
- రిపోర్టులు ఆన్‌లైన్‌లోనే ఇస్తున్నవైనం
- వేలకు వేలు అర్పించుకుంటున్న సామాన్య జనం
- డయాగ్నస్టిక్ కేంద్రాలతో ఆస్పత్రుల కుమ్మక్కు
- ఫిర్యాదులను పట్టించుకోని వైద్య ఆరోగ్య శాఖ

"ఖమ్మం నగరంలోని కొన్ని డయాగ్నస్టిక్ కేంద్రాల్లో నిలువుదోపిడీ జరుగుతోంది. అడ్డదారుల్లో ఆస్పత్రి వర్గాలు, డయాగ్నస్టిక్ కేంద్రాల యజమాన్యాలు కుమ్మక్కై రోగులను పీల్చిపిప్పి చేస్తున్నారు. ఏ లక్షణాలతో వెళ్లినా డాక్టర్ ముందు పంపించేది డయాగ్నస్టిక్ కేంద్రాలకే. ఇదే ఆసరా చేసుకుని ఆరోగ్య పరీక్షలను నిర్వహించే నిర్ధారణ కేంద్రాలు అక్రమాలకు తెరతీస్తున్నాయి. రక్త పరీక్షలు, స్కానింగ్, హెచ్‌ఆర్‌సీటీ, ఎంఆర్ఐతో పాటు దాదాపు 50 రకాల పరీక్షలకు రాష్ట్ర ప్రభుత్వం చార్జీలను నిర్దేశించినా, వాటిని డయాగ్నస్టిక్ కేంద్రాలు బేఖాతర్ చేస్తున్నాయి.

-ఖమ్మం కలెక్టరేట్

7

పచ్చి మిర్చి భగ్గు

- బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.120
- రైతుబజార్‌లో కిలో రూ.110

7

ఓటు వేస్తూ ఫొటో

కేసు నమోదు చేసిన పోలీసులు

6

'మధిర' ఓటరు కరుణ ఎవరిపైనో!

సైలెంట్ పోలింగ్‌లో కనిపించిన భిన్నమైన మార్పు

మధిర, మే 14: ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో మధిర అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక విశిష్టత ఉంది. ఇది ఎస్సీ నియోజకవర్గం కావడంతోపాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇక్కడినుంచే ప్రాతినిధ్యం వహించడం. జడ్పీ చైర్మన్‌గా బీఆర్ఎస్‌నేత లింగాల కమల్‌రాజు ఉండటం. అంతేకాక కమ్యూనిస్టులకు దశాబ్దాలుగా కంచుకోటగా విలసిల్లిన ప్రాంతం కావడం. గతంలోనూ, ప్రస్తుతం రాష్ట్రస్థాయిలో కీలకంగా రాణించిన నేతలు మధిర నేతలే కావడంగా చెప్పవచ్చు. రెండు రాష్ట్రాల సరిహద్దు కావడంతో ఆంధ్రా ప్రభావం ఇక్కడి ప్రజలపై ఎక్కువగా ఉంది. ఓటర్లపై ఆంధ్రా రాజకీయ ప్రభావం ఎక్కువగా పనిచేస్తుంది. ఇక్కడ ఉన్న ప్రజల్లో అత్యధిక బాగం ఆంధ్రా మూలాలు ఉన్నవారే. యాస, బాష, ఆచార వ్యవహారాలు అన్నీ కూడా ఆంధ్రానే పోలి వుంటాయి. రెడ్డి సామాజిక వర్గం, కమ్మ సామాజిక వర్గం ఆధిపత్యం చలామణిలో ఉంది. ఎస్సీలో మాదిగ సామాజిక వర్గం జనాభా రాష్ట్రంలోనే మధిరలో అత్యధికం. ఈ తరుణంలో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ఈసారి చాలా సైలెంట్‌గా జరిగింది. ఓటరు నాడి పసికట్టడం కష్టతరమైంది. ఎలాంటి అలజడులు లేకుండా ప్రజలంతా ప్రశాంత పోలింగ్‌కు సహకరించి సైలెంట్‌గా వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

గత ఎన్నికలకు .. ఇప్పటికీ ఎంతో మార్పు

2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో అప్పటి టీఆర్ఎస్ తరుపున నామా నాగేశ్వరరావు, కాంగ్రెస్ తరుపున రేణుగా చౌదరి పోటీ చేశారు. అప్పుడు టీఆర్ఎస్ అధికారంలో ఉండగా మధిర ఎమ్మెల్యేగా కాంగ్రెస్ తరుపున భట్టి విక్రమార్కనే ఉన్నారు. రేణుకా చౌదరికి మధిర నియోజకవర్గంలో 63,134 ఓట్లు రాగా, నామా నాగేశ్వరరావుకు 81,932 ఓట్లు వచ్చాయి. 18,798 ఓట్ల ఆదిక్యం టీఆర్ఎస్ అభ్యర్థి నామాకు లభించింది. ఈసారి అదే రెండు పార్టీలు తలపడ్డాయి. అయితే గత పరిస్థితులు మారాయి. బీఆర్ఎస్ (టీఆర్ఎస్) అధికారం కోల్పోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి మధిర ఎమ్మెల్యే భట్టి డిప్యూటీ సీఎంగా కీలక బాధ్యతలు చేపట్టారు. మధిర ప్రాంత ప్రజల్లో పలుకుబడి ఉన్న పొంగులేటి, తుమ్మల రాష్ట్ర మంత్రులుగా ఉన్నారు. దీంతో ఓటరు అభిప్రాయాలు మారాయి. కాంగ్రెస్ పార్టీ సంక్షేమపథకాల జోరు ప్రజలను ప్రభావితం చేసింది. ఈతరుణంలో ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో ప్రజలు బిన్నమైన తీర్పు ఇవ్వనున్నట్లు రాజకీయ పండితులు బావిస్తున్నారు.



రాజకీయ వలసల ప్రభావం ఎవరికి లాభించేనో..

గత అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాజకీయాలు మారాయి. పలువురు పలుకుబడి కలిగిన నాయకులు భారీగా కాంగ్రెస్‌లోకి చేరారు. బీఆర్ఎస్‌లో పలు అధికారిక, అనధికారిక పదవులు చేపట్టిన వారంతా ఆ పార్టీ వీడి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో బలంగా ఉన్న బీఆర్ఎస్ బలం కొంత తగ్గింది. ఇలా ఓటర్ల చీలికల కారణంగా పార్టీల బలాబలాలు మారాయి. పట్టణంలోనూ అదే పరిస్థితి నెలకొంది. తరుచూ జరుగుతున్న రాజకీయల వలసల తరుణంలో ఓటరు ఎవరికి లాభంచేకూర్చారనేచర్చ ఆసక్తి కరంగా మారింది

గతంలో అసెంబ్లీకి ఒకరిని,
పార్లమెంట్‌లో వేరొకరిని ఆదరించిన ఓటర్లు

గతంలో మూడు సార్లు జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మధిర నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల్లో ఓటర్లు కాంగ్రెస్‌కు పట్టం కడితే పార్లమెంట్ ఎన్నికల్లో వేరే పార్టీని ఆదరించారు. 2009లో అసెంబ్లీలో కాంగ్రెస్ తరుపున భట్టి విక్రమార్క గెలుపొందగా, పార్లమెంట్ ఎన్నికల్లో టీడీపీ తరుపున పోటీ చేసిన నామా నాగేశ్వరరావును ఆదరించారు. అప్పుడు పోటీ కాంగ్రెస్, టీడీపీ మధ్య జరిగింది. కాంగ్రెస్ తరుపున రేణుకా చౌదరి పోటీ చేస్తే 59,641 ఓట్లు వచ్చాయి. నామాకు 69,290 ఓట్లు రాగా 9,649 ఓట్ల ఆదిక్యం లభించింది. అలాగే 2014లో జరిగిన ఎన్నికల్లో అసెంబ్లీకి కాంగ్రెస్ అభ్యర్థి భట్టి విక్రమార్క గెలుపొందగా పార్లమెంట్ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఆదరించారు. పొంగులేటికి 12,295 ఓట్లు ఆధిక్యం వచ్చింది. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ తరుపున భట్టి విక్రమార్క గెలుపొందగా 2019 పార్లమెంట్ ఎన్నికల్లో టీఆర్ఎస్ తరుపున పోటీచేసిన నామా గెలుపొందారు. అంతేకాక ప్రతి సారి అసెంబ్లీలో కాంగ్రెస్‌కు పట్టకట్టిన మధిర నియోజకవర్గ ఓటర్లు ఆతర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో టీఆర్ఎస్‌ను అత్యధిక స్థానాల్లో గెలిపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీల కతీతంగా భట్టికి ఓటేసిన ఓటర్లు తర్వాత భిన్నమైన తీర్పులు ఇస్తూ వచ్చారు. అయితే రాజకీయాలు పూర్తిగా మారాయి. టీడీపీ గతంలో కాంగ్రెస్ మద్దతివ్వగా ఈసారి బీజేపీకి మద్దతిచ్చింది. ప్రజల అభిప్రాయాలు మారాయి. ఈసారి గత పార్లమెంట్ ఎన్నికల కన్నా ఓటర్లు పెరిగారు. పోలింగ్ శాతం స్వల్పంగా పెరిగింది.

సైలెంట్‌గా జరిగిన పోలింగ్ పట్ల కాంగ్రెస్ పార్టీ పూర్తి సంతృప్తితో ఉండగా బీఆర్ఎస్ నాయకులు కూడా ఓటర్లు సైలెంట్‌గా తమకే అనుకూలంగా ఓట్లు వేశారని నమ్ముతున్నారు. సామాజిక వర్గాల సమీకరణ తమకు కలిసి వస్తుందని బావిస్తున్నారు. ఇలా ప్రతి ఎన్నికలోనూ భిన్నమైన తీర్పు ఇచ్చిన మదిర ఓటర్లు ఈసారి సైలెంట్‌గా ఎవరిని ఆదరించనున్నారో.. వేచి చూడాల్సిందే.. మధిర నియోజకవర్గంలో ఎవరిని ఆదరిస్తారో తేలాలంటే జూన్ 4న ఓటర్లు తీర్పు కోసం ఆగాల్సిందే...

పట్టభద్రుల్లో ఓటు హక్కుపై

కనిపించని ఆసక్తి

● **గతంకన్నా భారీగా తగ్గిన ఓటర్ల నమోదు**

మధిర, మే 14: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలపట్ల విద్యావంతుల్లోనే ఆసక్తి సన్నగిల్లింది. సాదారణ ఎన్నికల్లో నిరక్ష్యరాస్యులే నయం ఓటు హక్కు వినియోగించుకొనేందుకు, పేర్లు నమోదు చేసుకొనేందుకు భారీగా తరలి వస్తున్నారు. అలాంటిది పట్టభద్రుల నియోజకవర్గంలో ఓటు హక్కు నమోదు కోసం పట్టభద్రులైన విద్యావంతుల్లో కదలిక లేకుండా పోయింది. గత 2021 ఎన్నికల్లోనే పట్టభద్రుల ఓట్లు భారీగా తగ్గాయి. ఈసారి మరీ తగ్గిపోవడం విద్యావంతుల్లో ఓటుహక్కుపట్ల ఉన్న ఆసక్తి ఏపాటిదో తెలియజేస్తుంది. మధిర నియోజకవర్గంలో గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో 4567 పట్టభద్రులైన ఓటర్లు ఉండగా ప్రస్తుత ఉప ఎన్నికల్లో 3387 మంది మాత్రమే తమ ఓటు హక్కుకోసం నమోదు చేసుకున్నారు. అంటే గత ఎన్నికలతో పోల్చితే ఈసారి 1175 ఓటర్లు తగ్గిపోయారు. ఎన్నికలు జరిగిన ప్రతిసారి ఓటు హక్కుకోసం నమోదు చేసుకోవాల్సిరావడం వల్ల పట్టభద్రుల్లో ఓటు నమోదు పట్ల ఆసక్తి లేకుండా పోయింది. అంతేకాక ఓటు కోసం నమోదు చేసుకోవాలంటే ఆన్‌లైన్‌లో ఇంటర్‌నెట్ సెంటర్లకు వెళ్లి నమోదు చేసుకోవాల్సిరావడం. ఆ సర్టిఫికెట్లు గెజిటెడ్ సంతకం చేయించి రెవెన్యూ కార్యాలయాల్లో అందజేయాల్సివుంది. ఇందుకు కొంత ప్రయాస కావడం కూడా కారణంగానే తెలుస్తుంది. కొందరు ఓటు నమోదు కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగినా మ్యాన్యువల్‌గా నమోదు లేదని ఆన్‌లైన్‌లోనే నమోదు చేసుకోవాలని సిబ్బంది తిరస్కరించారని చెబుతున్నారు. ఆన్‌లైన్ సెంటర్లలో నమోదుకు ఒక్కొక్కరికి రూ.100 ఖర్చుతోపాటు వాటిపై గెజిటెడ్ సంతకం చేయించి అధికారులకు అందజేయాల్సిరావడం ఇబ్బందిగా మారిందనే అభిప్రాయం చాలా మంది వ్యక్తం చేశారు. ఈనెల చివరిలో జరగనున్న పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మధిర నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 3387 మంది ఉన్నట్లు అధికారులు ప్రకటించారు. వీరిలో పురుషులు 2129మంది, మహిళలు 1257 మంది ఇతరులు ఒకరు ఉన్నారు. ఈ మేరకు ఓటర్ల లిస్టులు తయారు చేసినట్టు అధికారులు తెలిపారు.

భూసార పరీక్షలకు ఇదే అనువైన సమయం

వైరా, మే 14: భూసార పరీక్షలకు ఇదే అనువైన సమయం అని, భూసార పరీక్షలు అత్యంత అవసరమని వైరా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ రవి కుమార్ తెలిపారు. భూసార పరీక్షల ఆవశ్యకతను వివరిస్తూ రైతుల్లో అవగాహన కల్పించేందుకు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు కార్యక్రమాలు చేపట్టారు. ఈ భూసార పరీక్షల ఆవశ్యకత గురించి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. నేలల్లో సహజంగా ఉన్న పోషక పదార్థాలతో పాటు అదనంగా వేసిన సేంద్రియ, రసాయనిక ఎరువుల్లోనే పోషకాలు మొక్కలకు అంది పంట దిగుబడికి దోహదపడతా యి కాబట్టి నేలల్లో ఉన్న భూసారాన్ని తరచూ తెలుసుకోవ డం ఎంతో అవసరం. తద్వారా ఎరువుల వాడకంలో అనవస రపు ఖర్చులు చేయకుండా భూసారాన్ని కాపాడుకుంటూ అధిక, సుస్థిర దిగుబడులు సాధించవచ్చు. దీనికి సంబంధించి రైతులు తమ పొలాల్లోని మట్టిని రెండేళ్లకోసారి పరీక్ష చేయించుకుంటే మంచిది. పోషక పదార్థాల గురించే కాక భూమిలో చౌడుగుణాలను సున్నం శాతాన్ని, నేల కాలుష్యాన్ని గుర్తించేందుకు ఎంతో దోహదపడుతుంది. భూసార పరీక్షలు చేయించుకొనే విధానం, వాటి వల్ల కలిగే ప్రయోజనాల గురించి రైతులకు అవగాహన కల్పించారు.


అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

పినపాక నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతం

» కలెక్టర్ ప్రియాంక » సోమవారం రాత్రి ఈవీఎంల తరలింపు తనిఖీ


సోమవారం రాత్రి వెబ్ మానిటరింగ్ పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రియాంక

మణుగూరు, మే 14: మహబూబాబాద్ ఎస్టీ 110 పినపాక నియోజకవర్గంలోని పార్లమెంట్ ఎన్నికల ఓటర్ ప్రక్రియ సెక్టర్ల వారిగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంత వాతావరణంలో ఎటువంటి అవాంఛనీయమైన సంఘటనలు లేకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తులో సజావుగా జరిగాయని కలెక్టర్ ప్రియాంక తెలిపారు. సోమవారం రాత్రి పినిపాక నియోజకవర్గం పోలింగ్ సామగ్రి తిరిగి స్ట్రాంగ్ రూంకు చేర్చిన తర్వాత సంబంధిత వివరాలను కలెక్టర్ ఏఆర్ఓ ప్రతీక్‌జైన్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల సరళిని ప్రతి గంట గంటలకు జిల్లాకు సమాచారం అందించారని తెలిపారు. వెబ్ కాస్టింగ్ ద్వారా నిరంతర పరిశీలనలు జరిగాయన్నారు. సమస్యాత్మక మండలాలుగా ఉన్న కరకగూడెం గుండాల, ఆళ్లపల్లి సెక్టర్లకు సంబంధించిన పోలింగ్ పూర్తి అయిన తర్వాత ప్రత్యేక పోలీసు సీఆర్‌పిఎఫ్ బలగాల ద్వారా ఎన్నికల సామగ్రిని స్ట్రాంగ్ రూంకు తరలించామన్నారు. పీవోలు, ఏపీవోలు సెక్టర్ అధికారులు పర్యవేక్షణ అధికార బృంద సమష్టిగా ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించడంలో సఫలీకృతులయ్యారని పేర్కొన్నారు. పోలీ సు, సీఆర్‌పిఎఫ్, మెడికల్ టీమ్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్, డిడి ట్రైబల్ వెల్ఫేర్ మణెమ్మ, ఏడీ అగ్రికల్చర్ భాస్కర్, ఎస్ఓ సురేష్‌బాబు, ఏసీ ఎంఓ రమణయ్య, డిటి ఆర్ఓఎఫ్ఆర్ శ్రీనివాస్, జేడీఎం హరికృష్ణ, తహసీల్దార్ రాఘవ రెడ్డి, నాగరాజు, నాయబ్ తహసీల్దార్ కృష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు వేస్తూ సెల్‌ఫోన్‌లో ఫొటో యువకుడిపై కేసు



ఖమ్మం రూరల్, మే 14: ఓటు వేస్తు సెల్‌ఫోన్‌లో వీడియోతీసి దాన్ని సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేసిన యువకుడిపై ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదు అయింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మండల పరిదిలోని ఏదులాపురం గ్రామానికి చెందిన ఏపూరి తరుణ్ సెల్‌ఫోన్‌తో పోలింగ్ బూత్‌లోకి వెళ్లి తాను ఓటు వేసిన గుర్తు, వీవీప్యాట్‌లో వచ్చి స్లిప్ కనిపించేలా సెల్ఫీ వీడియో తీశాడు. దాన్ని సామాజిక మాద్యమాల్లో పోస్టు చేశారు. ఈ విషయంపై ఎన్నికల అధికారులకు సీవిజిల్ యాప్‌లో ఫిర్యాదు అందగా పాలేరు నియోజకవర్గ ఫ్లైయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జీ చంద్రకుమార్ స్థానిక పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేశారు. చంద్రకుమార్ ఫిర్యాదు మేరకు ఏపూరి తరుణ్‌పై ప్రజాప్రాతినిధ్యం చట్టం ప్రకారం కేసునమోదు చేసినట్లు ఎస్ఐ రామారావు తెలిపారు.

వైభవంగా రామయ్య పట్టాభిషేకం



పట్టాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం, పాల్గొన్న భక్తులు

భద్రాచలం, మే 14: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి మంగళవారం పట్టాభిషేకం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఏప్రిల్ 17న శ్రీరామ పునర్వసు దీక్ష స్వీకరించిన భక్తులు సోమవారం దీక్ష విరమణ చేయడంతో మరుసటి రోజు పట్టాభిషేక కార్యక్రమాన్ని పుష్యమి నక్షత్రం సమయాన భద్రాద్రి రామయ్యకు నిర్వహించారు. ముందుగా శ్రీ సీతారామచంద్రస్వామి నిత్య కల్యాణమూర్తులను నిత్య కల్యాణ మండప వేదిక వద్దకు తీసుకొచ్చారు. ఈ సమయంలో తొలుత స్వామి వారికి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం సంకల్పం, కలశా వాహన, అష్టదిక్పాలక ఆవాహన, రామాయణంలోని పట్టాభిషేక ఘట్ట పారాయణం, పట్టాభిషేక వైభవ వివరణను రామాయణపారాయణదారులు ఎస్టీజీ అంతర్వేది కృష్ణమాచార్యులు వివరించారు. అనంతరం జలప్రోక్షణ, వేద ఆశీర్వచనం, మంగళహారతితో పట్టాభిషేక కార్యక్రమం పరిసమాప్తి అయ్యింది. ఈ కార్యక్రమంలో ఉప ప్రధాన అర్చకులు అమరవాది మురళీకృష్ణమాచార్యులు, ముఖ్య అర్చకులు అమరవాది మధుసూదనాచార్యులు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరా జరగాలి

» వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదేశించిన ట్రాన్స్‌కో సీఎండీ

ఖమ్మం సంక్షేమవిభాగం, మే 14: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అంతరాయం లేని నిరంతర విద్యుత్ సరఫరా జరపాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి విద్యుత్‌శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో విద్యుత్ సమస్యలు, నిరంతర విద్యుత్ పంపిణీపై రివ్యూ నిర్వహించారు. 33కేవీ లైన్ వ్యవస్థ సక్రమంగా లేక పోవడంతో విద్యుత్ సమస్యలు ఉత్పన్నమైతున్నాయన్నారు. వేసవి తీవ్రతకు ముందే ఓవర్ లోడింగ్ ట్రాన్స్ ఫార్మర్లను మార్చడంలో నిర్లక్ష్యం చేయటం ద్వారా సమస్యలు ఏర్పాడ్డాయన్నారు. విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్లపై నిబంధనల మేరకు ఏఈలు తొలగించాలని సూచించారు. విద్యుత్ పనులు పొందిన కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా పనులు చేయడంతో కొద్ది పాటి గాలికే విద్యుత్‌శాఖకు ఆపార నష్టం వాటిల్లుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్ఈ సురేందర్, డీఈలు, ఏడీఈ లు, ఏఈలు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

పాల్వంచ, పాల్వంచ టౌన్ మే 14: కుటుంబ కలహాలతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పాల్వంచలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. మణుగూరుకు చెందిన మహమద్ పాషా(32)కు 10 ఏళ్ల క్రితం వివాహం అయ్యింది. కానీ అతని ప్రవర్తన నచ్చక భార్య గత కొన్ని సంవత్సరాలుగా ఆమె పుట్టింట్లోనే ఉంటుంది. దీర్ఘకాలంగా భార్య కాపురానికి రాకపోవడంతో అతడు తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. ఇంట్లో ఎవ్వరికీ చెప్పకుండా పాల్వంచ వచ్చి జాతీయ రహదారి పక్కనే ఉన్న ఓ లాడ్జిలో రూమ్ అద్దెకు తీసుకున్నాడు. ఒక గంట తరువాత తనను నిద్ర లేపమని లాడ్జి వారికి చెప్పాడు. అదే విధంగా వారు వెళ్లి ఎంత పిలిచినా స్పందించకపోడంతో అనుమానించి తలుపులు తెరిచి చూశారు. ఫ్యాన్‌కు ఉరేసుకొని ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతుడు రాసిన సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్ఐ బానాల రాము తెలిపారు. కాగా మృతుడు మహమద్ పాషా గతంలోనే పలు గంజాయి కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

ధ్వంసమైన తల్లాడ-బాలపేట ఆర్అండ్‌బీ రోడ్డు


ధ్వంసమైన బాలపేట రోడ్డు

తల్లాడ, మే 14: తల్లాడ-బాలపేట ఆర్అండ్‌బీ రోడ్డు ధ్వంసమైంది. దీంతో నిత్యం వాహనదారులు నరకయాతన పడుతున్నారు. ఈ రోడ్డులో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. మండల కేంద్రమైన తల్లాడ నుంచి మల్లవరం మీదుగా బాలపేట వరకు ఆర్అండ్‌బీ తారు రోడ్డును నిర్మించారు. ఈ రోడ్డు మీదుగా తల్లాడ, మల్లవరం, బాలపేట, గంగదేవిపాడు, ఏన్కూరు మండలం నూకాలంపాడు, జన్నారం గ్రామాలకు వందలాది వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి. ఇటీవల తల్లాడ నుంచి మల్లవరం మీదుగా గంగదేవిపాడుకు ఆర్అండ్‌బీ తారు రోడ్డు మంజూరైంది. ప్రస్తుతం ఆరోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులు స్పందించి ధ్వంసమైన బాలపేట ఆర్అండ్‌బీ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వేంసూరులో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మిస్తాం

» సీతారామ ద్వారా వచ్చే ఏడాది నాటికి గోదావరి నీరు
» కాంగ్రెస్ విజయం కోసం కృషి చేసిన కార్యకర్తలకు అభినందనలు
» వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


తుమ్మలను కలిసిన వేంసూరు మండల కాంగ్రెస్ నాయకులు

దమ్మపేట, మే 14: ఖమ్మం జిల్లా వేంసూరులో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి కృషి చేస్తానని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. దమ్మపేట మండలం గండుపల్లిలోని మంత్రి నివాసంలో దమ్మపేట, పెనుబల్లి, అశ్వారావుపేట, సత్తుపల్లి, అన్నపురెడ్డిపల్లి, ములకలపల్లి తదితర మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పలువురు మంగళవారం తుమ్మలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ అన్ని మండలాలకు కనీస రహదారులు లేక పోయినా తానే స్వయంగా తారు రోడ్లు వేయించినట్లు తెలిపారు. రాష్ట్రంలోనే వేంసూరు మండలంలోని భూములు మంచివన్నారు. ఈ మండలంలో 5వేల ఎకరాల్లో పామాయిల్ విస్తరణ చేయాలని నిర్ణయించామన్నారు. వచ్చే ఏడాది జూన్ నాటికి ఇక్కడ పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణాన్ని చేపడతామన్నారు. వేంసూరు మండలంలోని లింగపాలెం వద్ద గ్రీన్‌ఫీల్డ్ రహదారికి ఎగ్జిట్ ఏర్పాటు చేయిస్తానని తుమ్మల హామీ ఇచ్చారు. అభివృద్ధి చెందాలంటే అది వ్యవసాయం ద్వారానే సాధ్యమని పేర్కొన్నారు.

రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే పామాయిల్ సాగుతోనే సాధ్యమన్నారు. ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు భారీ మెజారిటీతో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ విజయానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలను మంత్రి అభినందించారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన వారందరూ స్థానిక సంస్థల్లో పదవులు పొందుతారన్నారు. ఇప్పటి నుంచి స్థానిక సంస్థల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని తుమ్మల సూచించారు. సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాలు మరింత అభివృద్ధి చెందాలంటే గోదావరి నీరు రావాలన్నారు. ఈ నియోజకవర్గాలకు సీతారామ ప్రాజెక్టు ద్వారా 2025 జూన్ నాటికి గోదావరి జలాలు వచ్చేలా కృషి చేస్తున్నట్లు తుమ్మల తెలిపారు.

అన్నపురెడ్డిపల్లి మండల కాంగ్రెస్ నాయకుడు వనమా గాంధీతో తుమ్మల ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ములకలపల్లి మండలానికి చెందిన సీపీఐ నాయకుడు నరాటి ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు పలు సమస్యలను తుమ్మల దృష్టికి తీసుకెళ్లారు. అశ్వారావుపేట, దమ్మపేట, పెనుబల్లి మండలాలల సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తుమ్మలను కలిసిన వారిలో కొయ్యల అచ్యుతరావు, కేవీ సత్యనారాయణ, బొల్లికొండ నాగేశ్వరరావు, చెలికాని ప్రసాదరావు, భాస్కర రావు, చెన్ను కృష్ణయ్య, రాయల నాగేశ్వరరావు, ఎర్రా వసంతరావు, వాసం శ్రీను, చల్లగుళ్ల నర్సింహారావు, మన్నెం అప్పారావు, దొడ్డా ప్రసాదు, మొగళ్లపు చెన్న కేశవరావు, జ్యేష్ట సత్యనారాయణ చౌదరి తదితరులున్నారు.

'పట్టభద్రుల' ఎమ్మెల్సీ బరిలో 52 మంది

» 27న పోలింగ్... జూన్ 5న కౌంటింగ్

నల్లగొండ, మే 14: వరంగల్ -ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక బరిలో 52 మంది అభ్యర్థులు ఉన్నారు. మొత్తం 63మంది నామినేషన్లు వేయగా, 11మంది అభ్యర్థులు తమ నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నల్లగొండ కలెక్టరేట్‌లోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్లను ఉపసంహరించుకున్న అభ్యర్థులు తమ పత్రాలను అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ములుగు జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ సీహెచ్.మహేందర్‌జీకి అందజేశారు. ఇదిలా ఉంటే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ఈ నెల 27వ తేదీన ఉమ్మడి వరంగల్ - ఖమ్మం-నల్లగొండ జిల్లాల పరిధిలోని 12 జిల్లాలు అయిన సిద్ధిపేట, జనగాం, హన్మకొండ, వరంగల్, మహబూబాబాద్ జిల్లాలతో పాటు ములుగు, భూపాలపల్లి, భద్రాద్రి, ఖమ్మం, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, నల్లగొండ జిల్లాలోని 605 పోలింగ్‌స్టేషన్లలో పోలింగ్ జరగనుంది. మొత్తం 4,63,839 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. కౌంటింగ్‌ను జూన్ 5వ తేదీన నిర్వహించనున్నారు.

ఉపసంహరించుకున్న అభ్యర్థులు వీరే

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సంబంధించి 11 మంది అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. యువతరం పార్టీకి చెందిన బండారు నాగరాజుతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కేదారి మేకల, చీదళ్ల వెంకటసాంబశివరావు, పోతుల ప్రార్థనతో పాటు పోతుల యాదగిరి నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. వీరితో పాటు ద్యైద సోమసుందరం, సోమగాని నరేందర్, గంగిరెడ్డి కోటిరెడ్డి, రేకల సైదులు, జన్ను భరత్, రత్నం ప్రవీణ్ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు.

కొండెక్కిన ఫలరాజు

» ఆకాశాన్నంటున్న మామిడిపండ్ల ధరలు » మార్కెట్‌లో డజన్ రూ.400పైనే అమ్మకాలు
» తీవ్ర వర్షాభావంతో తగ్గిన పూతకాత » అకాల వర్షాలకు నేలరాలిన కాయలు


మార్కెట్లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న మామిడికాయలు

కొత్తగూడెం టౌన్, మే14: ఫలరాజుగా పేరొందిన మామిడి పండ్ల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. వేసవిలో దొరికే మామిడికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుంది. చిన్నాపెద్దా తేడా లేకుండా మామిడిపండ్లను ఇష్టపడతారు. అయితే తీవ్ర వర్షాభావ పరిస్థితులతో ఈ ఏడాది మామిడి దిగుబడి భారీగా తగ్గిపోయింది. సీజన్‌లో మామిడి కాపు సక్రమంగా లేక ఇబ్బంది పడ్డ రైతులను ఇటీవల వచ్చిన గాలిదుమారాలు, అకాల వర్షాలు తీవ్ర నష్టానికి గురిచేశాయి. గాలిదుమారాలకు తోటల్లో ఉన్న కొద్దిపాటి కాయలు నేలరాలాయి. దాంతో మామిడి పండ్లకు మరింత డిమాండ్ పెరిగింది. ధరలు అందుబాటులో లేకపోవడంతో సామాన్యులు మామిడిపండ్లు కొనుగోలు చేయడానికి వెనుకడుగు వేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో డజన్ మామిడి పండ్లు రూ.400 నుంచి రూ.500 వరకు పలుకుతున్నాయి.

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో చంద్రుగొండ, అశ్వరావుపేట, సత్తుపల్లి, తిరువూరు తదితర ప్రాంతాల నుంచి పట్టణాలకు మామిడి సరఫరా అవుతుంది. ఈ ఏడాది కొద్ది మొత్తంలో బంగినపల్లి మామిడిపండ్లు మార్కెట్లో లభిస్తున్నా, చిన్న, పెద్ద రసాల పండ్లు దొరకడం లేదు. తీపి మామిడిపండ్ల పరిస్థితి ఇలా ఉంటే పచ్చడి మామిడి కాయలు కూడా మార్కెట్‌లో దొరకడం లేదు ఎక్కడైనా లభించినా వాటి ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండడం లేదు. పెరిగిన ధరలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు.

రెప్పవాల్చని నిఘా..24 గంటల భద్రత

» స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్ఠ బందోబస్తు
» రిటర్నింగ్ అధికారి కలెక్టర్ గౌతమ్
» పొన్నేకల్లులోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం పరిశీలన

ఖమ్మం రూరల్, మే 14: పార్లమెంట్ నియోజకవర్గానికి చెందిన స్ట్రాంగ్ రూమ్‌లకు ఈవీఎం యంత్రాల తరలింపు ప్రక్రియ పూర్తయిందని, ఈవీఎంలు భద్రపర్చిన స్ట్రాంగ్ రూమ్‌లకు మూడంచెల పటిష్ఠ భద్రత ఏర్పాటు చేసినట్లు రిటర్నింగ్ అధికారి కలెక్టర్ గౌతమ్ తెలిపారు. మండల పరిధిలోని పొన్నేకల్లులోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రం, స్ట్రాంగ్ రూమ్‌లను, ఈవీఎం యంత్రాలను పార్లమెంట ఎన్నికల సాధారణ పరిశీలకులు సంజయ్‌జి కోల్టేతో కలిసి మంగళవారం పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ ఈవీఎంల యంత్రాల తరలింపు ప్రక్రియ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పారదర్శకంగా యంత్రాలను తరలించినట్లు తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సీఆర్‌పీఎఫ్, ఆర్మీ, స్థానిక పోలీసులు 24 గంటలు కాపలా ఉంటారన్నారు. స్ట్రాంగ్ రూమ్‌లకు అన్ని వైపులా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. సీసీ ఫుటేజీలు చూడాటానికి టెలివిజన్‌లను ఏర్పాటు చేశామన్నారు. సీసీ కెమెరాలు అంతరాయం లేకుండా పనిచేసేందుకు చర్యలు తీసుకున్నామని వివరించారు. అభ్యర్థులు అభ్యర్థుల ఏజెంట్లు వచ్చి టెలివిజన్‌లో సీసీ కెమెరాలను పరిశీలించవచ్చని, పాస్‌లు ఉన్న వారు స్ట్రాంగ్ రూమ్‌ల వద్దకు వెళ్లి పర్యవేక్షణ చేసుకోవచ్చని సూచించారు. లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌కి సంబంధించిన పత్రాలను పక్కాగా పరిశీలించామని తెలిపారు.

ప్రశాంతంగా పోలింగ్ ముగిసిందని పేర్కొన్నారు. ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రం నుంచి పటిష్ఠ బందోబస్తు మధ్య ఈవీఎంలను రిసెప్షన్ కేంద్రానికి, అక్కడి నుంచి స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించామన్నారు. ఖమ్మం పార్లమెంట్ పరిధిలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు, గతం కంటే అధికంగా పోలింగ్ నమోదు అయిన పోలింగ్ కేంద్రాల పత్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీపీ సునీల్‌దత్, అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, సహయ ఎన్నికల అధికారులు ఆదర్శ్ సురభి, సత్యప్రసాద్, వేణుగోపాల్, రాజేశ్వరి, గణేష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.


స్ట్రాంగ్ రూంలను పరిశీలిస్తున్న కలెక్టర్

క్రైం సమాచారం

ట్రాక్టర్ బోల్తా.. యువకుడు మృతి



మోతీలాల్ మృతదేహం

లక్ష్మీదేవిపల్లి, మే 14: ట్రాక్టర్ బోల్తాపడి యువకుడు మృతి చెందిన సంఘటన లక్ష్మీదేవిపల్లి మండలం కారుకొండ గ్రామపంచాయతీలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గడ్డిగుట్టకు చెందిన ధరావత్ మోతీలాల్ (22) ట్రాక్టర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఉదయం కారుకొండ నుంచి హేమచంద్రాపురం వైపు వెళ్తూ మార్గమధ్యలో మలుపు వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి కిందపడడంతో మోతీలాల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తండ్రి రాంలాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇదిలా ఉండగా హేమచంద్రాపురం, కారుకొండ గ్రామపంచాయతీల మార్గాలగుండా కొందరు ట్రాక్టర్ యజమానులు రాత్రింబవళ్లు జోరుగా అక్రమ ఇసుక రవాణా సాగిస్తున్నారని, పొట్టకూటి కోసం ట్రాక్టర్లను నడుపుతూ జీవనం సాగించే వారు ప్రమాదాల బారీన పడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ సంఘటన సైతం ఇసుకరవాణా నేపథ్యంలో చోటుచేసుకుందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇసుక అక్రమ రవాణాను అరికట్టడంలో పోలీసులు పూర్తిగా విఫలం చెందుతున్నారని, ఇటువంటి ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే విషయాలు వెలుగులోకి వస్తున్నాయని సమాచారం. ఇప్పటికైనా తగిన నిఘా ఏర్పాటు చేసి అక్రమ ఇసుకరవాణాను, మట్టితవ్వకాలను నిలుపుదల చేయాల్సిందిగా స్థానికులు కోరుతున్నారు.

చికిత్స పొందుతూ వివాహిత...

తల్లాడ, మే 14: అత్తింటి వేధింపులు భరించలేక ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతున్న వివాహిత ఆదివారం తెల్లవారుజామున మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తల్లాడ మండలం పినపాక గ్రామానికి చెందిన ఉద్దగిరి మనీషా(26)కు తల్లాడ మండలం పినపాక గ్రామానికి చెందిన ఉద్దగిరి సురేష్‌తో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. కాగా ఇటీవల భర్తతో పాటు అత్తింటి కుటుంబ సభ్యుల వేధింపులు తట్టుకోలేక ఈనెల 9న పినపాకలోని స్వగృహంలో ఉరేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భర్త వేరే మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతోపాటు వారి కుటుంబసభ్యులు వేధించడంతో తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయమై మంగళవారం మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.కొండల్‌రావు తెలిపారు.

అశ్వారావుపేటలో వ్యక్తి.....

అశ్వారావుపేట రూరల్, మే 14: పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి చెందగా, పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ శివరామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రాలోని తిరుపతి ప్రాంతానికి చెందిన గుజరాత్ రాహుల్(35)కు పదిహేళ్ల క్రితం అశ్వారావుపేటలోని నందమూరినగర్‌కు చెందిన శిల్పతో వివాహం అయింది. అయితే కుటుంబకలహాల నేపథ్యంలో శిల్ప పుట్టింటికి వచ్చింది. ఈనెల 10న అతడు అశ్వారావుపేట వచ్చి భార్యను కాపురానికి కోరాడు. ఇందుకు భార్య నిరాకరించడంతో బంధువులతో మాట్లాడిన తరువాత అక్కడే పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అక్కడే ఉన్న కానిస్టేబుల్ మనోజ్‌ను రక్షించి ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాహుల్ ఈనెల 11న అర్ధరాత్రి మృతి చెందాడు. మంగళవారం ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కల్లూరులో సెక్యూరిటీ గార్డు ...

తల్లాడ, మే 14: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న సెక్యూరిటీ గార్డు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్లూరుకు చెందిన సెక్యూరిటీ గార్డు బొడ్డు వెంకటేశ్వర్లు(42) ఈనెల 12 రాత్రి ఓటు వేసేందుకు తల్లాడ నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా, మిట్టపల్లి బ్రిడ్జి వద్ద ఉన్న గుంతలను తప్పించబోయి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. వెంకటేశ్వర్లు కోదాడలోని మహా సిమెంట్ ఫ్యాక్టరీలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. ఈమేరకు తల్లాడ ఎస్‌హెచ్‌వో పి.వెంకటేశ్వర్లు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి...

దమ్మపేట, మే 14: ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని అల్లిపల్లి గ్రామశివారులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిల్లగుంపునకు చెందిన గండికోట మోతే(42) సోమవారం రాత్రి తన స్వగ్రామం ఆంధ్రాలోని ఏలూరు జిల్లా చింతలపుడిలోని ఎర్రగుంటపల్లికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా, అల్లిపల్లి గ్రామ సమీపంలో వాహనం అదుపుతప్పి పడిపోయాడు. స్థానికులు క్షతగాత్రుడిని అశ్వారావుపేట ఆసుపత్రికి తరలించగా, అతడిని పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు..

ఇల్లెందు, మే14: విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన సంఘటన ఇల్లెందు మండలం లలితాపురంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పూనెం ధాన్‌రాజు(35) తన ఇంట్లో ఉన్న సీలింగ్ ఫ్యాన్ రిపేర్ చేస్తుండగా విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండి యాదగిరి దాన్‌రాజ్ చిన్నతనంలోనే మృతి చెందగా తల్లి అదేమ్మ గ్రామంలో అంగన్‌వాడీ ఆయాగా పనిచేస్తుంది.

గుర్తు తెలియని కారు ఢీకొని ఒకరు..

ఖమ్మంక్రైం, మే14: గుర్తు తెలియని కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం ఉదయం ఖమ్మం నగర పరిధిలో జరిగింది. అర్బన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతకాని మండలం రామకృష్ణాపురానికి చెందిన గుంటి దేవానందం(48) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. తన కుమార్తెలను హైదరాబాదు పంపేందుకు రామకృష్ణాపురం నుంచి మంగళవారం ఉదయం ఖమ్మంలో బస్సు ఎక్కించాడు. తిరిగి ఇంటికి వెళుతుండగా ధంసలాపురం బ్రిడ్జి సమీపంలో గుర్తు తెలియని కారు ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమనాస్పదంగా యువతి..



రమ్య మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు

ఆళ్లపల్లి, మే 14: అనుమనాస్పదంగా ఓ యువతి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని తనికిబండల గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఈసం రామయ్య కుమార్తె రమ్య(20) ఈ ఏడాది ఇంటర్ పూర్తి చేసి ఇంటి వద్దే ఉంటుంది. మంగళవారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకొని వస్తున్న క్రమంలో ఒక్కసారిగా ఫిట్స్‌లా వచ్చి అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు యువతిని ఆళ్లపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, ఆమెను పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. కాగా నేను చదువుకుంటానమ్మా అంటూ.. ఈ లోకం నుంచే శాశ్వతంగా వెళ్లిపోయావా బిడ్డా... అని కుమార్తె మృతదేహంపై తల్లి రోదిస్తున్న రోదన పలువురిని కంటతడి పెట్టించింది. మృతిగల ప్రధాన కారణాలు ఇంకా తెలియరాలేదు.

కుక్క దాడిలో ముగ్గురికి గాయాలు

కామేపల్లి, మే 14: కుక్క దాడి చేసిన ఘటనలో ముగ్గురికి గాయాలైన సంఘటన కామేపల్లి మండలం పండితాపురంలో మంగళవారం చోటు చేసుకుంది. ఇంట్లో ఉన్న ముగ్గురిపై ఓ కుక్క కరవడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిలో దుద్దుకూరి నిత్య, తోటకూరి నాగమణి, సురిపిన్ని పిన్నే ఉన్నారు. వీరిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పండితాపురంలో చోరీ

కామేపల్లి, మే 14: మండలంలోని పండితాపురం గ్రామంలో ఓ ఇంట్లో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. పండితాపురం గ్రామానికి చెందిన జల్లి సంజయ్ కుటుంబ సభ్యులతో అరు బయట నిద్రిస్తున్నాడు. అర్ధరాత్రి సమయంలో దొంగలు ఇంట్లోకి చోరబడి బీరువాలో ఉన్న రూ.లక్షా10వేల నగదు, రూ.60వేల విలువల గల బంగారం, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఉదయం చూసేసరికి బీరువా తలుపులు తెరిచి ఉండడంతో చోరీ జరిగిందని గ్రహించి పోలీసులకు సమాచారం అందించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన స్థలాన్ని క్లూస్ టీం పరిశీలించి వేలిముద్రలు సేకరించారు.

అడవిపంది దాడిలో తునికాకు రైతుకు గాయాలు

ఆళ్లపల్లి, మే 14: తునికాకు కట్టలు కట్టేందుకు నారకట్లు(తాడు) కోసం అడవికి వెళ్లిన ఓ రైతుపై అడవిపంది దాడి చేసి గాయపరిచిన సంఘటన మంగళవారం ఆళ్లపల్లి మండలంలో చోటు చేసుకుంది. ఆళ్లపల్లి మండలం, నడిమిగూడెం పంచాయతీ, లొద్దిగూడెం గ్రామానికి చెందిన పాయం లక్ష్మీనారాయణ తునికాకు కట్టలు కట్టేందుకు కావాల్సిన నారకట్లు(తాడు) కోసం, మరో ఇద్దరితో కలిసి అడవికి వేల్లాడు ఈ క్రమంలో అప్పటికే పొదల్లో నక్కి ఉన్న అడవి పంది ఒక్కసారిగా అతడిపై దాడి చేసి గాయపరిచింది. తోటి రైతులు కేకలు వేయడంతో అడవిపంది అక్కడ నుంచి వెళ్లిపోయింది. తోటి రైతులు వెంటనే అతడిని మర్కోడుకు తీసుకువచ్చి చికిత్స అందించారు. ప్రభుత్వం, తునికాకు వ్యాపారస్తులు బాధితుడిని ఆదుకోవాలని రైతు కుటుంబం, గ్రామస్థులు కోరుకుంటున్నారు.

నిర్ధారణకు వెళితే ..

నిలువు దోపిడే...



- నగరంలో డయాగ్నస్టిక్ కేంద్రాల మాయాజాలం
- నిర్దేశిత ఫీజుల కంటే అధికంగా వసూలు
- సమస్య ఏదైనా స్కానింగ్ తప్పనిసరి
- రిపోర్టులు ఆన్‌లైన్‌లోనే ఇస్తున్న వైనం
- వేలకు వేలు అర్పించుకుంటున్న సామాన్యజనం
- డయాగ్నస్టిక్ కేంద్రాలతో ఆస్పత్రుల కుమ్మక్కు
- ఫిర్యాదులను పట్టించుకోని వైద్య ఆరోగ్య శాఖ

ఖమ్మం కలెక్టరేట్, మే 14: 'వెంకటగిరి గ్రామానికి చెందిన ఓ యువకునికి వారం రోజులుగా జ్వరం వస్తుండడంతో నగరంలో ఓ వైద్యుణ్ని కలిశారు. ఆయన సీబీపీ, ఇతరత్రా పరీక్షలను రాసాడు.వైరా రోడ్డు పరిధిలో ఓ డయాగ్నస్టిక్ సెంటర్‌కు వెళితే సీబీపీకి, మరో పరీక్షకు రూ 1100 తీసుకున్నారు.'

'ఇటీవలె ఓ గ్రామానికి చెందిన యువకుడు రోడ్డు ప్రమాదంలో తలకు చిన్న గాయం అయ్యింది. నాలుగు కుట్లు వేశారు. తలకు ఏమైనా దెబ్బతగిలిందేమో అని డాక్టర్ స్కానింగ్ రాసాడు. దీంతో డయాగ్నస్టిక్ సెంటర్‌లో స్కానింగ్ కోసం వెళ్లాడు. తల స్కానింగ్‌కు రూ 4,500 తీసుకున్నారు. అంతే కాదు లోపల సిబ్బంది స్కానింగ్ చేయడానికి ముందు ఓ ఇంజక్షన్ చేయాలని రూ 1000 అవుతుందని మరో వెయ్యి నొక్కారు..'

'మరో కేంద్రంలో హెచ్‌ఆర్‌సీటీ స్కానింగ్‌కు రూ. 3వేలు తీసుకుని ఫిల్మ్ ఇచ్చారు కానీ రేడియాలజిస్టు నివేదిక కాపీ మాత్రం ఇవ్వలేదు. అదేమని అడిగితే కంప్యూటర్‌లో ప్రింట్ రావడంలేదు.. మళ్లీ వచ్చినప్పుడు ఇస్తాం.. మీకు ఆన్‌లైన్‌లో పంపిస్తాం అంటూ నచ్చజెప్పి పంపించారు.'

ఇవి ఖమ్మం నగరంలోని కొన్ని డయాగ్నస్టిక్ కేంద్రాల్లో జరుగుతున్న దోపిడీకి సాక్ష్యాలు. రోగ నిర్ధారణ కోసం వెళితే ఈ కేంద్రాలు నిలువుదోపిడీ చేస్తున్నాయి.. అడ్డదారుల్లో ఆస్పత్రి వర్గాలు, డయాగ్నస్టిక్ కేంద్రాల యజమాన్యాలు కుమ్మక్కై రోగులను పీల్చిపిప్పి చేస్తున్నారు. ఏ లక్షణాలతో వెళ్లినా డాక్టర్ ముందు పంపించేది డయాగ్నస్టిక్ కేంద్రాలకే. ఇదే ఆసరా చేసుకుని ఆరోగ్య పరీక్షలను నిర్వహించే నిర్ధారణ కేంద్రాలు అక్రమాలకు తెరతీస్తున్నాయి.

ఖమ్మం నగరంలో దాదాపు 8వరకు డయాగ్నస్టిక్ కేంద్రాలు ఉన్నాయి. వీటిల్లో రక్త పరీక్షలు, స్కానింగ్, హెచ్‌ఆర్‌సీటీ, ఎంఆర్‌ఐ, తో పాటు దాదాపు 50 రకాల పరీక్షలను నిర్వహిస్తుంటారు. రాష్ట్ర ప్రభుత్వం కోవిడ్ నేపథ్యంలో రెండేళ్ల క్రితం హెచ్‌ఆర్‌సీటీకి రూ. 2000, ఆర్టీపీసీకి రూ. 500 తీసుకోవాలని నిర్ధారించింది. కానీ నగరంలోని పలు డయాగ్నస్టిక్ కేంద్రాల్లో మాత్రం హెచ్‌ఆర్‌సీటీకి రూ.2,500 నుంచి రూ.3 వేల వరకు వసూలు చేస్తున్నారు. చిన్న పాటి జ్వరం వచ్చి ప్రైవేటు ఆస్పత్రులకు వెళితే చాలు డయాగ్నస్టిక్ కేంద్రానికి పంపిస్తున్నారు. వారం రోజుల జ్వరానికి, ప్రమాదాల్లో గాయపడిన వారికి, తలనొప్పి లేస్తుందని వెళ్లిన వారు డాక్టర్లను సంప్రదిస్తే చాలు ఇబ్బడిముబ్బడిగా రక్తపరీక్షలు, స్కానింగ్‌లు రాస్తున్నారు. ఇదే అదనుగా డయాగ్నస్టిక్ కేంద్రాలు రోగుల భయాన్ని సొమ్ము చేసుకుంటున్నాయి. నగరంలో పేరుపొందిన ల్యాబ్‌ల లో కూడా నిర్ధారణ పరీక్షల రేటును అమాతంగా పెంచేసి వసూళ్లు చేస్తున్నారు. .

నగరంలోని అనేక డయాగ్నస్టిక్ కేంద్రాలు ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలతో, ఆస్పత్రుల్లో ఉండే ల్యాబ్‌ల యజమాన్యాలతో లింక్ పెట్టుకుని మరీ రోగుల నుంచి అధిక ఫీజులను వసూలు చేస్తున్నాయి. ఆస్పత్రి యాజమాన్యాలు ఏలా చెబితే అలా రిపోర్టులను పంపిస్తూ అటు నిర్ధారణ పరీక్షలకు, ఇటు వైద్యం పేరుతో రోగులను నిలువుదోపిడీ చేస్తున్నాయంటూ ఆరోపిస్తున్నారు.

వాస్తవానికి డయాగ్నస్టిక్ కేంద్రాల్లో, ల్యాబ్‌ల్లో రేడియాలజిస్టు నివేదికలు ప్రధానం . రేడియాలజిస్ట్ ఉంటేనే ఆ స్కానింగ్ కేంద్రానికి గానీ, డయాగ్నస్టిక్ కేంద్రానికి గాని అనుమతులను మంజూరి చేస్తారు. కానీ నగరంలో కొన్ని కేంద్రాల్లో కనీసం రేడియాలజిస్టులు లేకుండానే నిర్ధారణ పరీక్షలు, స్కానింగ్‌లు తీస్తున్నారు. డయాగ్నస్టిక్ కేంద్రంలో కనీసం రేడియాలజిస్టులు లేకుండా స్కానింగ్, సీటీ, ఎంఆర్‌ఐలు తీసి ఫిల్ములు ఇచ్చేసి నివేధికలను మాత్రం ఆన్‌లైన్‌లో ఇస్తున్నారని ఆరోపిస్తున్నారు. రేడియాలజిస్టులు లేకుండానే ఫిల్ములను ఆన్‌లైన్‌లో పంపించి నివేదికలను తయారు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. సామాన్యులు, మధ్యతరగతి ప్రజలు జబ్బు చేసినా, అత్యవసర పరిస్థితుల్లో ఆస్పత్రికి వెళితే డాక్టర్లు రాసే పరీక్షలకు డయాగ్నస్టిక్ సెంటర్లకు అయ్యే ఖర్చులు భరించ లేక మిన్నకుండిపోవాల్సి వస్తోందని వాపోతున్నారు. రోగుల నుంచి ఫీజులు వసూలు చేస్తున్న ఇలాంటి కేంద్రాలపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకుంటే తప్పఈ మాఫియాకు అడ్డుకట్ట పడే ఆస్కారం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. .

ఫిర్యాదు చేస్తే చర్యలు : డీఎంహెచ్‌వో డాక్టర్ మాలతి

డయాగ్నస్టిక్ సెంటర్లలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అధిక ఫీజులు వసూలు చేసే వారిపై పిర్యాదు చేసినా వాటిపై చర్యలుంటాయి.

ఎవరైనా బాధితులు వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు, తనకు కానీ పిర్యాదు చేయొచ్చు. వివరాలను గోప్యంగా ఉంచుతాం. అనుమతి లేని నిర్ధారణ కేంద్రాలపై కూడా చర్యలు తీసుకుంటాం.

పచ్చిమిర్చి భగ్గు

- బహిరంగ మార్కెట్‌లో కిలో రూ. 120
- రైతుబజార్‌లో కిలో రూ. 110



ఖమ్మం మార్కెట్, మే 14: నగరంలోని రైతుబజార్‌లు, కూరగాయల మార్కెట్‌లలో పచ్చిమిర్చి ధరలు భగ్గుమన్నాయి. బహిరంగ మార్కెట్‌లో మంగళవారం కిలో పచ్చిమిర్చి రూ. 120కు అమ్ముతుండగా, రైతుబజార్లలో మాత్రం రూ. 110 బోర్డు ధరలు నిర్ణయించారు. వేసవి కాలం కావడంతో పాటు పచ్చిమిర్చి సాగుకు అనుకూల ప్రాంతాలలో ఈ ఏడాది తక్కువగా పంట సాగు చేయడంతో డిమాండ్‌కు సరిపడా సరఫరా లేక ధరలు రోజు రోజుకూ పెరుగుతూ వినియోగదారులకు చుక్కలు చూపిస్తున్నాయి. వారం క్రితం కిలో రూ. 50 లు నుంచి రూ. 60 లు పలికిన పచ్చిమిర్చి ఒక్కసారిగా డబుల్ ధరలు నమోదయ్యాయి. ఎండాకాలం సీజన్ కావడంతో పాటు ప్రతి ఇంట్లోనూ, ఫంక్షన్లలల్లో పచ్చిమిర్చి వినియోగం ఎక్కువగా ఉంటుంది. కాగా పచ్చిమిర్చితో పాటుగా ఇతర కూరగాయల ధరలు సైతం స్వల్పంగా రోజు రోజుకూ పెరుగుతున్నాయి.

ఇదిలా ఉండగా మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలోని రైతుబజార్లలో ధరల కంటే నగరంలో ఇతర ప్రాంతాలలో ఉన్న ప్రైవేటు మార్కెట్లు, వీధి వ్యాపారుల ప్రాంగణాలలో ధరలు అధికంగా ఉన్నాయని వినియోగదారులు మండిపడుతున్నారు. లోకల్ రైతులు అసలు పచ్చిమిర్చిని సాగు చేయకపోవడంతో ఉమ్మడి జిల్లా వినియోగదారులకు పూర్తిగా ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకొని అందించాల్సి ఉంటుంది. పచ్చిమిర్చిని ఏపీలోని కడప, బద్వేల్, గుంటూరు, మైదుకూరుతో పాటు కర్ణాటక రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవడంతో రవాణా చార్జీల ధరలు అధికంగా ఉండటంతో ధరలు మరింతగా పెరుగుతున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

- జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజగోపాల్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి రాజగోపాల్

ఖమ్మం లీగల్ మే 14: జిల్లాలో జూన్ 8న నిర్వంచబోయే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.రాజగోపాల్ అన్నారు. మంగళవారం లోక్ అదాలత్ విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలను ఇతర న్యాయాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీ పడదగిన క్రిమినల్ కేసులను ప్రత్యేకశ్రద్ధతో గుర్తించి కక్షిదారులకు నోటీసులు పంపేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చెల్లని చెక్కుల కేసు లు, భార్యభర్తల మధ్య తగాదాలు, పరిష్కారమైన సంబంధించిన అన్ని కేసులు కూడా పరిష్కారమవుతాయి కాబట్టి అలాంటి వాటిపై ప్రత్యేకశ్రద్ధ కనబర్చాలన్నారు. కక్షిదారులకు లోక్ అదాలత్ ప్రయోజనాలను వివరించి వారిని రాజీ దిశగా ప్రోత్సహించాలన్నారు. సివిల్ కేసులలో ముఖ్యంగా రుణ వసూలు కేసులలో సులబవాయిదాల పద్ధతిలో కూడా అప్పు చెల్లించే విధంగా రాజీ పడవచ్చని, ఇట్టి కేసులో లోక్ అదాలత్ ఇచ్చే అవార్డును చట్టప్రకారం అమలు చేయవచ్చన్నారు. ఈ సమావేశంలో మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి కె.ఉమాదేవి, రెండో అదనపు న్యాయాధికారి వి.అపర్ణ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి కె.వి.చంద్రశేఖర్‌రావు, అదనపు సీనియర్ సివిల్ న్యాయాధికారి ఎం.కల్పన, రెండో అదనపు న్యాయాధికారి వై.బిందుప్రియ, మూడో అదనపు న్యాయాధికారి వి.మాధవి పాల్గొన్నారు.

తిరుమలాయపాలెంలో

గాలి దుమారం

- ఇళ్లపై విరిగిపడిన చెట్లు
- విద్యుత్‌కు అంతరాయం

తిరుమలాయపాలెం, మే14: మండలంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన చిరుజల్లు వాన కురిసింది. దీంతో ఆయా గ్రామాల్లో భారీ గాలి రావడంతో ఇంటిపై ఉన్న రేకులు లేచిపోయ్యాయి. మండలంలోని గోల్‌తండా, జింకలగూడెంలో గాలి దుమారానికి రేకులు లేచిపోయాయి. అలాగే గోల్‌తండా సమీపంలో ఖమ్మం వరంగల్ రహదారిపై చెట్లు విరిగిపడ్డాయి. రెండు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. దీంతో రోడ్డుపై భారీగా వాహనాలు నిలిచి పోయాయి. దీంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు అలాగే పాతర్లపాడు, గోల్‌తండా, జింకలగూడెం గ్రామాల్లో సుమారు 40విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. చెట్లు ఇండ్లపై పడ్డాయి.



గాలిదుమారానికి రోడ్డుపై విరిగిపడిన విద్యుత్ స్తంభాలు

గిరిజన యువకుడిపై దాడి చేశారని..

పోలీస్ స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ నాయకుల రాస్తారోకో



అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ ఎదుట రాస్తారోకో చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ నాయకులు

అశ్వారావుపేట, మే 14: బీఆర్ఎస్ పార్టీకి చెందిన గిరిజన యువకుడిని సీఐ చితకబాదడని ఆరోపిస్తూ మంగళవారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులకు మద్దతుగా మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు రాస్తారోకోలో పాల్గొన్నారు. అధికార పార్టీ నాయకుడి ఎదురుగానే తమ కార్యకర్తను చితకబాదారంటూ తాటి వెంకటేశ్వర్లు సీఐతో వాగ్వాదానికి దిగారు. పోలీసుల వైఖరికి నిరసన పోలీస్ స్టేషన్ ఎదుట రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు ఇచ్చారు. అధికార పార్టీ అండదండలతో బీఆర్ఎస్ కార్యకర్తలపై దౌర్జన్యాలకు పాల్పడితే ఊరుకునేది లేదంటూ హెచ్చరించారు. ఎన్నికల అనంతరం సోమవారం అనంతారం గ్రామంలో జరిగిన వాగ్వాదాన్ని అడ్డుపెట్టుకొని తమ కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి ఇష్టానుసారంగా కొట్టడాన్ని ఆయన ఖండించారు. రాస్తారోకోలో మాజీ జడ్పీటీసీ అంకత మల్లిఖార్జున రావు, మాజీ ఎంపీపీ బరెగడ కృష్ణ, మోహన్, తాళం సూరిబాబు, పాల్గొన్నారు.

దీనిపై సీఐ జితేందర్‌రెడ్డిని వివరణ కోరగా అనంతారంలో ఎన్నికల సందర్భంగా గ్రామంలో జరిగిన సంఘటనపై ఫిర్యాదు వచ్చింది. దీనిపై క్షేత్రస్థాయిలో విచారణ చేస్తున్నాము. ఈ ఘటనలో ఎవ్వరిని కొట్టలేదని, ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు.

తాటిచెట్లకు నిప్పంటుకుని ఎగిసిపడిన మంటలు..

- త్రుటిలో తప్పిన ప్రమాదం



అన్నారుపాడు గ్రామంలో నిప్పంటుకుని తాటిచెట్లు కాలుతున్న దృశ్యం

జూలూరుపాడు, మే 14: ప్రమాదవశాత్తూ తాటిచెట్లకు నిప్పంటుకుని మంటలు చెలరేగిన సంఘటన మండలంలోని అన్నారుపాడు గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని వెనుకబజారులో గుర్తు తెలియని వ్యక్తి చెత్త కుప్పకు నిప్పు అంటించాడు. ఈక్రమంలో ఆ నిప్పు సమీపంలో ఉన్న తాటిచెట్లకు అంటుకుని మంటలు వ్యాపించాయి. దీన్ని గమనించిన గ్రామస్థులు కొందరు అక్కడికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఈ చెట్లకు సమీపంలోనే ఇళ్లు ఉండటంతో నిప్పు వాటికి అంటుకుంటుందని ప్రజలు ఆందోళనకు గురయ్యారు. మంటలను ఆర్పివేయడంతో త్రుటిలో ప్రమాదం తప్పింది.

నేటి నుంచి దోస్త్ వెబ్ ఆప్షన్స్

ఖమ్మం ఖానాపురంహవేలి మే 14: డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు సంబంధించి బుధవారం నుంచి దోస్త్ వెబ్ ఆప్షన్స్ ప్రారంభంకానున్నాయి. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకొన్న విద్యార్థులు వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవచ్చు. ఈ నెల 6న ప్రారంభమైన రిజిస్ట్రేషన్ ప్రక్రియ 25 వరకు కొనసాగనున్నది. 27 వరకు వెబ్ ఆప్షన్స్‌కు అవకాశం ఉంది. మొదటి విడత సీట్ల కేటాయింపు జూన్ 3 వెలువడనున్నది. జూన్ 4న సెల్ఫ్ రిపోర్టింగ్ చేయవల్సి ఉంటుంది. రెండో విడత జూన్ 4 నుంచి ప్రారంభమై 19న కాలేజ్ ఫీజు, సెల్ఫ్ రిపోర్టింగ్ చేయవల్సి ఉంటుంది. మూడో విడత జూన్ 19న ప్రారంభమై 29న ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్, ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. నగరంలోని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో మంగళవారం డిగ్రీ ప్రథమ సంవత్సర ప్రవేశాలకు సంబంధించి ప్రచార పోస్టర్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ మొహ్మద్ జాకీరుల్లా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ బివి రెడ్డి, జీవన్, కోఆర్డినేటర్ పత్యవతి, దోస్త్ కన్వీనర్ ఎం సుబ్రమణ్యం, గోపి పాల్గొన్నారు.

అడవుల సంరక్షణపై అవగాహన



అడవులను పరిశీలిస్తున్న జిల్లా అటవీ అధికారి విక్రమ్‌సింగ్

రఘునాథపాలెం, మే 14: ఖమ్మం జిల్లాలో వారం రోజులు శిక్షణకు వచ్చిన ఐఎఫ్ఎస్ రేవంత్‌కు జిల్లా అటవీశాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్‌సింగ్ దగ్గరుండి అడవుల సంరక్షణ, ప్రభుత్వం తీసుకుంటున్న జాగ్రత్తలపై వివరించారు. మంగళవారం రఘునాథపాలెం, కొణిజర్ల, ఖమ్మం అర్బన్ మండలంలోని మల్లిపల్లి, గుబ్బగుర్తి అటవీ ప్రాంతం, ఖమ్మం అర్బన్‌లోని వెలుగుమట్ల అర్బన్ పార్కులో అటవీశాఖ అధికారులు పర్యటించారు. అడవుల సంరక్షణలో సాంకేతిక వినియోగం, డ్రోన్‌లతో అటవీ పర్యవేక్షణ, నూతన ప్లాంటేషన్, బేస్ క్యాంపుల నిర్వాహణపై శిక్షణ ఇచ్చారు. వారి వెంట ఎఫ్‌డీవో మంజుల, ఎఫ్ఆర్వో రాధిక తదితరులున్నారు.

'సొందుమియా ఆశయాలు సాధించాలి'



సొందుమియా మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

ముదిగొండ, మే 14: ముదిగొండ మండల కోఆప్షన్ సభ్యుడు, సీపీఎం సీనియర్ నాయకుడు పఠాన్ సొందుమియా(55) ఆశయాలు సాధించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం అనారోగ్యంతో మృతి చెందిన సొందుమియా మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు సానుభూతి, సంతాపం తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకుడు వాసిరెడ్డి వరప్రసాద్, మండల కార్యదర్శి బట్టు పురుషోత్తం, ఎంపీపీ సామినేని హరిప్రసాద్, వైస్‌ఎంపీపీ మంకెన దామోదర్, మందరపు వెంకన్న, భద్రయ్య, రాజు, సతీష్, నాగేశ్వరరావు, లక్ష్మయ్య తదితరులు నివాళులర్పించారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

భద్రాద్రి
కొత్తగూడెం
కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట

బుధవారం 15 మే 2024

ఉపాధ్యాయులపై లాఠీచార్జ్ అమానుషం

- పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశ్వరరావు, రవి

చుంచుపల్లి, మే14: కేంద్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల ప్రకారం పార్లమెంట్ ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులపై నారాయణకేడ్ ప్రాంతంలో లాఠీచార్జ్ చేయడాన్ని ఖండిస్తున్నామని భద్రాద్రి జిల్లా పీఆర్‌టీయూటీఎస్ అధ్యక్ష, కార్యదర్శులు డి.వెంకటేశ్వరరావు, రవి ఓ ప్రకటనలో మంగళవారం ఖండించారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు రావాల్సిన రెమ్యూనరేషన్ అడిగిన ఉద్యోగులపై లాఠీ చార్జ్ చేసేలా ఉసిగొల్పిన అధికారులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మిగతా జిల్లాల మాదిరిగానే రెమ్యూనరేషన్ చెల్లించాలని కోరారు.

ఖమ్మంలో కాంగ్రెస్ గెలుపు ఖాయం

- ఎన్నికల్లో పనిచేసిన ప్రతీ కార్యకర్తకు ధన్యవాదాలు
- జడ్పీ చైర్మన్ కంచర్ల, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల
- కొత్తగూడెం పొంగులేటి క్యాంపు కార్యాలయంలో పాత్రికేయులతో సమావేశం


కొత్తగూడెంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

చుంచుపల్లి, మే 14: ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురామ్‌రెడ్డి(ఆర్‌ఆర్‌ఆర్) గెలుపు ఖాయమని భద్రాద్రి జిల్లా జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, టీపీసీసీ సభ్యుడు, ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల కో-ఆర్డినేటర్ నాగా సీతారాములు ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం పొంగులేటి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. దేశ దిశను మార్చే ఓటు అనే ఆయుధాన్ని వినియోగించుకున్న ప్రతీ ఓటర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మం అభ్యర్థిగా రఘురామరెడ్డి గెలుపు ఖాయమని ఆయన గెలుపును ఏ శక్తి అడ్డుకోలేదని స్పష్టం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్‌ను ప్రజలు ఆదరించే స్థితిలో లేరని గత పదేళ్ల కాలంలో వారు ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. రఘురామరెడ్డి గెలుపు కోసం పని చేసిన ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, టీజేఎస్ శ్రేణులకు, ప్రజా ప్రతినిధులకు, కార్యకర్తలకు, నాయకులకు రుణపడి ఉంటామని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రజలకిచ్చిన హామీలను తూచా తప్పకుండా నెరవేర్చుతామని అన్నారు.


ఓటర్లకు కృతజ్ఞతలు తెలుపుతున్న కూటమి నాయకులు

ఖమ్మం సీటుతో పాటు, రాష్ట్రంలో అత్యధిక స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంటుందని, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కోనేరు సత్యనారాయణ, మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తోట దేవిప్రసన్న, నాయకులు వైశ్రీనివాస్‌రెడ్డి, చింతలపూడి రాజశేఖర్, గొల్లపల్లి దయానంద్, ఆంథోటిపాల్, మసూద్, చీకటి కార్తీక్, టిజెఎస్ నాయకులు పంపన శివప్రసాద్‌లు పాల్గొన్నారు.

రఘురాంరెడ్డి గెలుపు ఖాయం: డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల

పాల్వంచ టౌన్: ఖమ్మం పార్లమెంట్‌కు జరిగిన ఎన్నికల్లో మిత్రపక్షాలు బలపర్చిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి గెలుపు ఖాయమని, తెలంగాణ రాష్ట్రంలోనే అధికమెజార్టీతో విజయం సాధించనున్నారని డీసీఎంఎస్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు కొత్వాల శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత రవాణా సౌకర్యం, ఉచిత విద్యుత్, సబ్సిడిగ్యాస్, రైతుబంధు, త్వరలో ఇవ్వనున్న రుణమాఫీ పథకాల పట్ల ప్రజలు ఆకర్షితులై ఈ ఎన్నికల్లో బ్రహ్మరథం పట్టనున్నారన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియాకూటమి మెజార్టీ సీట్లు సాధిస్తాయని సర్వేలు తెలుపుతున్నాయని, అఖిలభారత కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా అన్నివర్గాల ప్రజలు, మిత్రపక్షాలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అవిశ్రాంతంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం కోసం అహర్నిశలు శ్రమించిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు కృషి చేసిన ప్రభుత్వ అధికారులకు, పోలీస్‌శాఖ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే, నేతల ధన్యవాదాలు..

మణుగూరుటౌన్: నియోజకవర్గం వ్యాప్తంగా సోమవారం నిర్వహించిన పార్లమెంట్ ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘలను చోటు చేసుకోకుండా సహకరించిన ఓటర్లకు, ప్రజలకు, అధికారులకు, పోలీస్ శాఖకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, డీసీసీబీ డైరెక్టర్, కాంగ్రెస్ నాయకులు తుళ్లూరి బ్రహ్మయ్యలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సీపీఐ, సీపీఎం నాయకులు కూడా ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. సీపీఎం రాష్ట్ర నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర నాయకులు బీ అయోధ్య, సీపీఎం నాయకులు కొడిశాల రాములు, లెనిన్‌బాబు, సాంబశివరావు, నర్సింహారావు, సీపీఐ నాయకులు పుల్లారెడ్డి, దుర్గాల సుధాకర్ తదితరులు ఉన్నారు.

ఓటర్లకు అభినంధనలు

అశ్వారావుపేట: ఇండియా కూటమి తరుపున పోటీ చేసిన ఖమ్మం పార్లమెంట్ అభ్యర్థి రామసహాయం రఘురామిరెడ్డి విజయం కోసం కృషి చేసిన కూటమిలోని భాగస్వామ్యులు, నాయకులు, కార్యకర్తలకు సీపీఐ జిల్లా నాయకులు సయ్యద్ సలీం, మండల కార్యదర్శి గన్నిన రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

అమరవీరుల ఆశయాలను సాధిస్తాం

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి నర్సింహారావు


మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి నర్సింహారావు

కొత్తగూడెం టౌన్, మే 14: కార్మికుల హక్కుల కోసం నిరంతరం శ్రమించిన కార్మికనాయకుడు జార్జ్ ఆశయ సాధనకు కృషి చేయాలని సింగరేణికాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు కోరారు. అమరవీరుల ఆశయాలను సాధించేందుకు మరిన్ని ఉద్యమాలు నిర్వహించాలని కోరారు. మంగళవారం కార్మిక ప్రాంతమైన రామవరంలో కార్మికనేత జార్జ్ 33వ వర్ధంతి సందర్భంగా స్తూపం వద్ద నివాళులర్పించారు. అరుణపతాకాన్ని ఎగురవేసిన అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సింగరేణి కార్మికులకు అనేకహక్కులు సాధించిపెట్టేందుకు ఉద్యమించిన నేతగా జార్జ్‌ను కొనియాడారు. శ్రమకు తగ్గ వేతనం చెల్లించాలని, కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధానమైన సమస్యలు పరిష్కరించాలని ఉద్యమించి కార్మికులకు అనేక హక్కులు సాధించారని తెలిపారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది రమేష్‌కుమార్ మక్కడ్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మచారి, బ్రాంచ్ అధ్యక్షులు రాజారావు, నాయకులు వై. వెంకటేశ్వర్లు, లిక్కి బాలరాజు, భూక్యా రమేష్, సూరం అయిలయ్య, సమ్మయ్య, వెంకట్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సుజాతనగర్ మండలంలో 81.95 శాతం ఓటింగ్

సుజాతనగర్, మే 14: సుజాతనగర్ మండలంలో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 81.95 శాతం ఓటింగ్ నమోదయినట్లు అధికారులు వెల్లడించారు. ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలలో బారులుదీరారు. మొత్తం 20 పంచాయతీల్లో 24 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం ఓటర్లు 22,338 కాగా 18,306 ఓట్లు పోలవడంలో 81.95 శాతం ఓటింగ్ నమోదయింది. గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే పోలింగ్ శాతం పెరిగినట్లు తెలుస్తుంది.

గతం కంటే.. పెరిగిన పోలింగ్‌శాతం

జూలూరుపాడు, మే 14 : పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌శాతం గతంలో పోల్చుకుంటే ఈ సారి పెరిగింది. 2019లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మండలంలో 79శాతం పోలింగ్ నమోదు కాగా ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో 81.97శాతం నమోదైంది. మూడుశాతం పోలింగ్ అధికంగా నమోదైంది.

ఘనంగా భగీరథ మహర్షి జయంతి


భగీరథ మహర్షి జయంతి వేడుకల నిర్వహిస్తున్న సగరులు

మణుగూరుటౌన్/చుంచుపల్లి మే 14: మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని గోల్డ్‌షాప్ వీధిలో సగర సంఘం ఆధ్వర్యంలో మంగళవారం శ్రీ భగీరథ మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేశారు. సంఘం పెద్దలు మాట్లాడుతూ.. సగరులందరు ఐక్యంగా ఉండాలని, ప్రభుత్వం నుంచి సగరులకు రావాల్సిన, చెందాల్సిన హక్కులను సాధించేందుకు భగీరథ మహర్షిలా ఐక్యంగా పోరాడి సాధించాలన్నారు. సంఘం బలోపేతానికి సగరులందరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు కురిమిళ్ల శంకరయ్య, కుర్మస్వామి, దొనికన రాజమౌళి, శంకరయ్య, కళావతి, కౌసల్య, సంఘం యువనాయకులు ఆర్ మధు, కురిమిళ్ల అశోక్, శ్రీనివాస్, డీ శ్రీనివాస్, కుర్మ శ్రీనివాస్, సుప్రిత తదితరులు పాల్గొన్నారు.

చుంచుపల్లి: భగీరథ మహర్షి జయంతి వేడుకలు చుంచుపల్లి మండలంలోని బాబూక్యాంప్ రామాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలిత ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి సగర సంఘం నాయకులు నివాళ్ళు అర్పించారు. భగీరథ మహర్షి కఠోరమైన దీక్షను చేపట్టి ఆకాశం నుంచి గంగను భూమిపైకి తీసుకొచ్చారని గుర్తు చేశారు. సగర ఉప్పర కులస్థులకు ఆరాధ్య దైవం భగీరథుడని అన్నారు. గతంలో తెలంగాణ ప్రభుత్వం మిషన్ భగీరథ కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టి భగీరథ మహర్షికి గుర్తింపు ఇచ్చారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు విద్యాసాగర్, మల్లేష్, బిక్షపతి, శ్రీనివాస్, కుమారస్వామి, కృష్ణ, రాజయ్య, నవీన్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

మాధారం బస్సు సర్వీస్‌ను గోవింద్‌తండా వరకు నడపాలి

కారేపల్లి,మే14: మండల పరిధిలోని మాధారం గ్రామం వరకు నడుస్తున్న ఆర్టీసీ బస్సుసర్వీసులను గోవింద్ తండావరకు పొడిగించాలని మంగళవారం పలువురు గ్రామస్థులు వైరాలో వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌ను కలిసివేడుకొన్నారు. ఖమ్మం బస్సు డిపోకు చెందిన పలు సర్వీసులు ఖమ్మం నుంచి వయా కారేపల్లి మాధారం నడుస్తున్నాయని, ఆసర్వీసులను గోవింద్‌తండా వరకు పొడిగించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే డిపో మేనేజర్‌తో మాట్లాడారు. సర్వీసులను పొడిగించాలని సూచించారు. సర్వీసులు నడిపేందుకు హామీ ఇచ్చారు.

దుమ్ముగూడెం మండలంలో గాలిదుమారం

దుమ్ముగూడెం మే 14: మండలంలోని పలుచోట్ల మంగళవారం సాయంత్రం వర్షం పడడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. తూరుబాక, సీతారాంపురం, గంగోలు, కాశీనగరం, మారాయిగూడెం, కొత్తపల్లి తదితర ప్రాంతాల్లో పలుచోట్ల గాలిదుమారంతో కూడిన వర్షం పడింది. గత రెండు రోజులుగా ఎండవేడిమిని తాళలేక ఇబ్బందులు పడుతున్న క్రమంలో ఒకింత ఉపశమనం లభించింది. ఈ ఏడాది మామిడి తోటల్లో కాపు అంతంత మాత్రంగానే ఉండగా, వరుస గాలిదుమారాలకు కాయలు రాలిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మలేరియా ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి


రక్తనమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

అశ్వారావుపేట రూరల్, మే 14: ఆదివాసీ గొత్తికోయ గ్రామాల్లో రానున్న కాలంలో మలేరియా ప్రభలకుండా ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సబ్ యూనిట్ అధికారి ఆజ్మీర వెంకటేశ్వరరావు సూచించారు. మండలంలోని గుమ్మడివల్లి పీహెచ్‌సీ పరిధిలో అత్యంత దట్టమైన అటవీ ప్రాంతంలో ఉన్న గొత్తికోయ గ్రామాలైన రేగళ్ల, జిల్లేడుపాకల్లో మంగళవారం వైద్య శాఖ ఆధ్వర్యంలో మలేరియా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. వైద్యసిబ్బంది నాలుగు బృందాలుగా విడిపోయి 10 కిలోమీటర్ల మేర అడవిలో ద్విచక్ర వాహనాలపై ప్రయాణాలు సాగించి గొత్తికోయలకు పరీక్షలు చేశారు. ఆయా గ్రామాల్లో గర్భిణులకు పరీక్షలు చేసి మందులు అందించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సబ్‌యూనిట్ అధికారి వెంకటేశ్వరరావు, హెచ్‌వీ దుర్గమ్మ, హెల్త్‌అసిస్టెంట్ బాస్కర్, వెంకటేశ్వర్లు, ఎంటీఎస్ విజయ్‌రెడ్డి, ఏఎన్ఎం రేవతి, విజయకుమారి, అంగన్‌వాడీ కార్యకర్త ప్రమీల, ఆశాకార్యకర్తలు, ఇతర వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మాఫియా, దందాలు చేసే వారి నుంచి పార్టీని కాపాడండి

- కొందరు కాంగ్రెస్ పార్టీని భ్రస్టు పట్టిస్తున్నారు
- తుమ్మల అభివృద్ధి ఫలాలు పార్టీని గెలిపిస్తున్నాయి
- కాంగ్రెస్ నాయకులు చెన్న కేశవరావు, సత్యనారాయణ చౌదరి


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు చెన్నకేశవరావు, సత్యనారాయణ చౌదరి తదితరులు

అశ్వారావుపేట, మే 14: కొందరు నియంతృత్వ ధోరణులతో కాంగ్రెస్ పార్టీని భ్రష్టుపట్టిస్తున్నారని, అలాంటివారి నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను కాపాడాలని సీనియర్ కాంగ్రెస్ నాయకులు మొగళ్ళపు చెన్నకేశవరరావు, జేస్ట సత్యనారాయణ చౌదరి అన్నారు. మంగళవారం వారు పట్టణంలో పలువురు కాంగ్రెస్ నాయకులతో కలసి విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ గత అసెంబ్లీ ఫలితాల్లో అందరు కలిసి పనిచేయడం వల్లే విజయం సాధ్యమైందన్నారు. తుమ్మల నాగేశ్వరరావు పార్టీలోకి రావడంతో విజయం తథ్యమైందన్నారు. గత ఎన్నికలలో విజయం సాధించిన తరువాత పూటకోపార్టీ మార్చే కొందరు తమ విజయంగ భావిస్తూ ఇసుక, మట్టి, మద్యం, భూ సెటిల్‌మెంట్‌లకు పాల్పడుతూ నియంతృత్వ ధోరణిలతో పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారని ఆరోపించారు. 40 ఏళ్లుగా కాంగ్రెస్‌ను నమ్ముకొని ఉన్న వారిని అణగదొక్కాలని చూస్తున్నారని, కాంగ్రెస్ కార్యకర్తలను కాపాడుకోవాల్సిన బాధ్యత పార్టీ పెద్దలకు ఉందన్నారు. రఘురాంరెడ్డి కూడ అత్యధిక మెజార్టీతో విజయం సాధించబోతున్నారన్నారు. సమావేశంలో కోఆప్షన్ సభ్యులు ఎస్‌కె పాషా, సత్యవరపు బాలయ్య, దాసరి నాగేంద్రరావు, చిమటబోయిన సత్యనారాయణ, జల్లిపల్లి దేవరాజ్, రాచకొండ బంగారం, ఎస్‌కె బషీర్, రమాదేవి,రవి, ఎస్‌కె షుకూర్, సురేష్, చిట్టియ్య, మోహనరావు పాల్గొన్నారు.

'ఉపాధి'పనులను పరిశీలించిన సీసీఎఫ్


ఉపాధిపనులను పరిశీలిస్తున్న సీసీఎఫ్

అశ్వాపురం మే 14: అశ్వాపురం ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని తుమ్మలచెరువు బీట్‌లో జరుగుతున్న గ్రామీణ ఉపాధిహామీ పనులను మంగళవారం జిల్లా ఫారెస్ట్ సీసీఎఫ్ భీమానాయక్ పరిశీలించారు. పనుల జరుగుతున్న తీరును,సౌకర్యాలను కూలీలను అడిగితెలుసుకున్నారు. అనంతరం సహజ అటవీ పనుల నిర్వహణను తనిఖీచేశారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో కృష్ణగౌడ్, వైల్డ్‌లైఫ్ ఎఫ్‌డీవో బాబు, మణుగూరు ఎఫ్‌డీవో మొహిద్దీన్, అశ్వాపురం రేంజర్ రమేష్, తుమ్మలచెరువు బీట్ అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మిక యూనియన్ కమిటీ ఎన్నిక


నూతన కమిటీ సభ్యులతో ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి

మణుగూరు, మే 14: ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్టు కార్మిక యూనియన్ మణుగూరు బ్రాంచ్ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వి జానయ్య, ఉపాధ్యక్షుడిగా దేవి, కార్యదర్శిగా పి సంజీవరెడ్డి, సహాయ కార్యదర్శిగా ఆర్ ప్రసాద్, కోశాధికారిగా విజయ్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా జె యాకయ్యలతో పాటు ఐదుగురు సభ్యులను ఎన్నుకున్నారు. ఇఫ్టూ జిల్లా అధ్యక్షులు ఆర్ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. జీవో 22 గెజిట్ చేసి కాంట్రాక్టు కార్మికులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు, సీఎంపీఎఫ్, చట్టబద్ద హక్కులను కార్మికులకు కల్పించాలన్నారు. ప్రతినెల 7వ తేదిలోపు వేతనాలను అందివ్వాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు రాజిరెడ్డి, లక్ష్మయ్య, కార్తిక్ ఇందిర పాల్గొన్నారు.

నియోజకవర్గ ఓటర్లకు కృతజ్ఞతలు: ఏఈఆర్‌వో ప్రతీక్‌జైన్

మణుగూరుటౌన్, మే 14: పినపాక నియోజకవర్గంలో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించిన ప్రజలకు, ఓటర్లకు, రాజకీయపక్షాల నాయకులకు, ప్రజా సంఘాల నేతలకు ఏఈఆర్‌ఓ, ఐటీడీఏ పీఓ కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గంలోని ఏడూ మండలాల తహశీల్దార్‌లకు, రెవెన్యూ సిబ్బందికి, ఇతర శాఖల అధికారులకు, సిబ్బందికి, పోలీస్‌శాఖకు ప్రత్యేక దన్యవాదాలు తెలిపారు.

ఫిజియోథెరపీ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- భవిత కేంద్రాన్ని తనిఖీ చేసిన సమ్మిళిత విద్య కో ఆర్డినేటర్ సైదులు


ఫిజియోథెరపి క్యాంపును పరిశీలిస్తున్న కో ఆర్డినేటర్ సైదులు

కొత్తగూడెం అర్బన్, మే 14 : దివ్యాంగుల కోసం ప్రతి వారం జిల్లా వ్యాప్తంగా ఉన్న భవిత సెంటర్లలో నిర్వహిస్తున్న ఉచిత ఫిజియెథెరపి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సమ్మిళిత విద్యా కో ఆర్డినేటరు ఎస్‌కే. సైదులు కోరారు. మంగళవారం సుజాతనగర్ లోని మండల ప్రాథమికపాఠశాలలో ఉన్న భవిత కేంద్రాన్ని ఆయన ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ఈ క్యాంపును 18సంవత్సరాల్లోపు ఉన్న దివ్యాంగ పిల్లలు సద్వినియోగం చేసుకునేందుకు అందరు సహకరించాలన్నారు. అక్కడ క్యాంపునకు వచ్చిన దివ్యాంగ పిల్లలతో, వారి తల్లిదండ్రులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. తల్లిదండ్రుల అభ్యర్థన మేరకు ఒక పిల్లవాడికి నడవడానికి రోలేటర్ ఇప్పించాలని కోరగా పై అధికారులతో చర్చించి రెండురోజుల్లో సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఫిజియోథెరపి రాని పిల్లల తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడి ఫిజియోథెరపి చేయించడం ద్వారా దివ్యాంగ పిల్లలకు కలిగే లాభాలను వారికి వివరించారు. జిల్లాలోని అన్ని మండలాల సమ్మిళిత విద్యాఉపాధ్యాయులు మండల కేంద్రంలో జరుగుతున్న ఫిజియోథెరపి క్యాంపును దివ్యాంగపిల్లలు సద్వినియోగం చేసుకునేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సమ్మిళిత విద్యాఉపాధ్యాయులు శ్రావణ్‌కుమార్, బేబి, ఫిజియోథెరపిస్టు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గని కార్మికులకు భద్రతపై అవగాహన



మాట్లాడుతున్న సింగరేణి జీకేఓసీ ఏజెంట్ వెంకటేశ్వర్లు

ఇల్లెందుటౌన్, మే 14: సింగరేణి ఇల్లెందు ఏరియా జీకే5ఓసీ ఉపరితలగని ఉద్యోగులకు ఉత్పత్తి, ఉత్పాదకత, భద్రతపై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రాజెక్టు ఆఫీసర్ బొల్లం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యాంత్రీకశక్తిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, యంత్రాల పని గంటలు పెంచాలని, బొగ్గు ఉత్పత్తి, రవాణా, రోజువారి లక్ష్యాలను అధిగమించాలని సూచించారు. బొగ్గు ఉత్పత్తి, రవాణాకు ఎటువంటి ఆటంకం కలగకుండ ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఎండతీవ్రత అధికంగా ఉన్నందున ఉద్యోగులు రక్షణపరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తికి ఆటంకాలు లేకుండ జాగ్రత్తలు పాటించాలని ప్రకటించారు. సింగరేణి సంస్థ నిర్ధేశించిన వార్షికలక్ష్యాలను సులువుగా అధిగమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గని మేనేజరు శివ ప్రసాద్, ప్రాజెక్టు ఇంజనీరు చిన్నయ్య, సీనియర్ పర్సనల్ అధికారి సుధాకర్, గుర్తింపుసంఘం పిట్ కార్యదర్శి సంజీవచారి, ప్రాతినిధ్యసంఘం పిట్ కార్యదర్శి బాబురావు తదితరులు పాల్గొన్నారు.